తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-01- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 184 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# ఓఆర్ఆర్ లోపల క్యూర్ జోన్ ప్రకటించిన సీఎం రేవంత్



- క్యూర్–ప్యూర్–రేర్‌తో తెలంగాణ కొత్త అభివృద్ధి దిశ
- ఓఆర్ఆర్ లోపల సర్వీస్ సెక్టార్ హబ్ లక్ష్యం
- ప్యూర్ జోన్ ద్వారా పెట్టుబడులకు కొత్త దారులు
- రేర్ జోన్‌తో గ్రామీణ వ్యవసాయ బలోపేతం
- 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు సిద్ధం
- గ్లోబల్ సమ్మిట్‌కు రాష్ట్రం రెడీ

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయడానికి ఆ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా విభజించామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో పారిశ్రామిక, మూసీ, పాత వాహనాల కాలుష్యాన్ని నిర్మూలించి నెట్ జీరో సిటీగా రూపాంతరం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు వంటి నగరాలు కాలుష్యం, వరదలు, శాంతిభద్రతల వంటి సమస్యలతో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయంటూ.. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌లో భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలకు తావులేకుండా 'క్యూర్' చేయాల్సిందేనని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికానున్న సందర్భంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్

మిగతా 2లో

పంచాయతీ పోలింగ్–1వ విడత..

# రికార్డు స్థాయిలో నామినేషన్లు

- మొదటి విడతలో 25,654 సర్పంచ్, 82,276 వార్డు నామినేషన్లు
- సూర్యాపేట, వికారాబాద్‌లో సర్పంచ్ స్థానాలకు భారీ పోటీ
- వార్డు నామినేషన్లలో రంగారెడ్డి అగ్రస్థానం
- అప్పీల్స్, ఉపసంహరణ, తుది జాబితా ఈ వారం పూర్తవనున్నాయి
- రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

2లో



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం సాయంత్రం 5 గంటల్లోపు అభ్యర్థులు భారీ సంఖ్యలో క్యూలైన్‌లో ఉండటంతో అర్ధరాత్రి వరకు నామినేషన్లు స్వీకరించారు. దీంతో ఆదివారం తొలివిడత నామినేషన్ల సంఖ్య తేలింది. మొదటి విడతలో 4,236 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 25,654 మంది, 37,440 వార్డులకు 82,276 మంది నామినేషన్లు వేశారు.

సూర్యాపేట జిల్లాలో సర్పంచ్ పదవుల కోసం అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు సమర్పించారు.

మిగతా 2లో

# తెలంగాణ 2 ఏళ్ల వేడుకలు

- రెండేళ్ల పాలన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు
- డిసెంబర్ 1 నుంచి జిల్లావారీ ఉత్సవాల షెడ్యూల్ విడుదల
- ఉస్మానియా వర్సిటీ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- డిసెంబర్ 8–9 గ్లోబల్ సమ్మిట్‌లో విజన్ డాక్యుమెంట్ విడుదల
- ఉప్పల్ స్టేడియంలో డిసెంబర్ 13న మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్

2లో



## కాంగ్రెస్ హిల్ట్‌పి భూ కుంభకోణంపై

# కేటీఆర్ బహిరంగ లేఖ



- హిల్ట్‌పి పాలసీపై కేటీఆర్ లేఖ సంచలనం
- భూ కుంభకోణ ఆరోపణలతో కాంగ్రెస్‌పై ఫైరయ్యిన కేటీఆర్
- రూ.5 లక్షల కోట్ల భూముల విషయంలో ప్రభుత్వంపై సూటి ప్రశ్నలు
- రాహుల్ స్పందించాలని కేటీఆర్ ఓపెన్ ఛాలెంజ్
- ప్రభుత్వం ఎందుకు మౌనం? కేటీఆర్ ప్రశ్న


హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

రూ.5 లక్షల కోట్ల విలువైన తెలంగాణ ప్రజల ఆస్తిని కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారుస్తామంటే ఒప్పుకునేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సొంతానికి తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడతామంటే ఒప్పుకునేది లేదని, ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేటీఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండ్రస్టియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హిల్ట్‌పి)ని భారత్‌లోని అతిపెద్ద భూ కుంభకోణాల్లో ఒకటిగా కేటీఆర్ అభివర్ణించారు. 'రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాల గురించి కాంగ్రెస్ అధిష్టానానికి తెలుసా, లేకుంటే తెలిసీ మౌనంగా ఉందా?'అని తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

మిగతా 8లో

# నేటి నుంచి కొత్త లిక్కర్ సేల్

- బెల్ట్ షాపుల కోసం గ్రామాల్లో పెద్దఎత్తున లాబీయింగ్
- కొత్త లిక్కర్ షాపుల ముందు బెల్ట్ షాపుల డిమాండ్ పెరుగుదల
- యువత భారీ లాభాల ఆశతో పోటీలోకి
- బెల్ట్ షాపులపై ఎక్సైజ్, పోలీసుల నుంచి చర్యలేమీ లేదు
- గ్రామాల్లో స్వీయ నియంత్రణ – ఒక్కటి లేదా రెండు షాపులకు మాత్రమే అనుమతి
- రూలింగ్ పార్టీ నేతల వద్ద లాబీయింగ్ పీక్స్
- సర్పంచ్–స్థానిక ఎన్నికల వేళ బెల్ట్ షాపుల హాట్ డిమాండ్



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల కొత్త మద్యం షాపులు తెరుచుకోనున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉన్న బెల్ట్ షాపుల్లోనూ మార్పులు చోటుచేసుకోనున్నాయి. దీంతో కొన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులను దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున పైరవీలు నడుస్తున్నాయి. షాపులను తమకే ఇప్పించాలంటూ ఏకంగా మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వ్యాపారులు ప్రాధేయపడుతున్నారు. ఈ మధ్య లక్కీ డ్రాలో మద్యం షాపులను సొంతం

మిగతా 2లో

# రైతుభరోసా పై కాంగ్రెస్ కుట్ర చేస్తున్నది: హరీశ్‌రావు

- పంటలు సాగు చేసిన వారికి మాత్రమే సహాయం చేస్తారన్న తుమ్మల వ్యాఖ్యలపై విమర్శ
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో 11 సార్లు రైతుబంధు విడుదల చేశామని హరీశ్‌రావు గుర్తు
- సన్నవడ్లు, మక్క, సోయా కొనుగోలుల చెల్లింపులు ఇంకా పెండింగ్

8లో



# డిసెంబర్ 4 నుంచి కవిత 'జనంబాట' యాత్ర పునఃప్రారంభం

- కవిత జనంబాట యాత్రకు నూతన షెడ్యూల్ విడుదల
- డిసెంబర్ 4 నుంచి కవిత జనంబాట మరోసారి ప్రారంభం"
- ఎన్నికల కోడ్ తర్వాత జనంబాట యాత్ర రీస్టార్ట్
- మళ్లీ బాటలోకి కవిత: జిల్లావారీ కొత్త తేదీలు ప్రకటింపు

8లో



# రాంచీలో టీమిండియా థ్రిల్లింగ్ విన్

## కుల్దీప్, హర్షిత్ ఘాటు బౌలింగ్

- 11 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన సఫారీలు – మిడిల్ ఆర్డర్ పోరాటం వృథా
- మాథ్యూ–యన్‌సెన్ అద్భుత ఇన్నింగ్స్‌కి సపోర్ట్ లేకపోవడంతో దక్షిణాఫ్రికా పరాజయం
- కుల్దీప్ యాదవ్ నాలుగు, హర్షిత్ రాణా మూడు వికెట్లు – భారత్ బౌలర్ల ప్రభావం స్పష్టంగా
- బాష్ వీరోచిత పోరాటం చేసినా 17 పరుగుల దూరంలో ఆగిన సఫారీలు

8లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# తెలంగాణ 2 ఏళ్ల వేడుకలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):




కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ స్టార్ ఆటగాడు లియోనల్ మెస్సీ పర్యటిస్తాడని వెల్లడించారు. డిసెంబర్ 1 నుంచి ఉమ్మడి జిల్లాల్లో సంబరాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 1న మక్తల్, 2న కొత్తగూడెం, 3న హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న దేవరకొండలో ఉత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7న ఉస్మానియా వర్సిటీలో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేస్తారని భట్టి వెల్లడించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో గ్లోబల్ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు.

"రెండేళ్ల పాలనలో ఏం చేశామో డిసెంబర్ 8న సదస్సులో చెబుతాం. భవిష్యత్తులో ఏం చేయబోతున్నామో 9న వివరిస్తాం. ఆ రోజే విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. తెలంగాణ విజన్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరిస్తాం. గ్లోబల్ సమ్మిట్‌లో స్టాళ్లను ప్రజలు సందర్శించేలా చర్యలు తీసుకున్నాం. డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో ప్రజలకు అనుమతి ఇస్తాం. డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో మెస్సీ ఫుట్‌బాల్ ఆడతారు. తెలంగాణ విజన్‌ను ఉప్పల్ స్టేడియంలో ఆవిష్కరిస్తాం. జిల్లాల్లో జరిగే ఉత్సవాల్లో మంత్రులు పాల్గొంటారు" అని భట్టి విక్రమార్క వెల్లడించారు.

పంచాయతీ పోలింగ్–1వ విడత..

# రికార్డు స్థాయిలో నామినేషన్లు



(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడ 159 పంచాయతీలకుగాను అత్యధికంగా 1,387 నామినేషన్లు దాఖలయ్యాయి. వికారాబాద్ జిల్లాలో 262 పంచాయతీల్లో సర్పంచ్‌ల కోసం1,383 నామినేషన్లు వేయగా, మహబూబాబాద్‌లో 155 పంచాయతీలకుగాను 1,239, కామారెడ్డి 167 జీపీలకు 1,224, రంగారెడ్డిలో 174 జీపీలకు 1,169 నామినేషన్లు దాఖలయ్యాయి.

వార్డు సభ్యుల విషయానికి వస్తే సీన్ మారింది. పంచాయతీలు ఎక్కువగా ఉన్న రంగారెడ్డి జిల్లాలో వార్డు స్థానాలకు నామినేషన్లు వెల్లువలా వచ్చాయి. ఖమ్మం జిల్లాలో కూడా వార్డుల్లో గట్టి పోటీ నెలకొంది. రంగారెడ్డి జిల్లాలో 1,530 వార్డులకుగాను 4,540, వికారాబాద్ 2,198 వార్డులకుగాను 4,379 నామినేషన్లు, ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో 1,740 వార్డులకు 4,041, కామారెడ్డిలో 1,520 వార్డులకు 3,832, సూర్యాపేటలో 1,442 వార్డులకు 3,791 నామినేషన్లు వచ్చాయి.

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం అధికారులు నామినేషన్లను పరిశీలించారు. స్క్రూటినీ చేసి అభ్యర్థుల జాబితా రూపొందించారు. తిరస్కరించిన నామినేషన్లపై సోమవారం సా యంత్రం వరకు అప్పీల్ చేసుకోవచ్చు. మంగళవారం ఈ అప్పీళ్లను పరిష్కరిస్తారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. అదేరోజు మధ్యా హ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు. 11వ తేదీన పోలింగ్ జరుగుతుంది.

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ఆదివారం నుంచి మొదలైంది. అయితే అర్ధరాత్రి వరకూ దాఖలైన నామినేషన్ల సంఖ్యపై స్పష్టత రాలేదు. రెండో విడతలో 4,333 సర్పంచ్, 38,350 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. 2వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుంది. 6న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. 14న పోలింగ్, అదే రోజు ఫలితాల ప్రకటన ఉంటుంది.



# ఓఆర్ఆర్ లోపల క్యూర్ జోన్ ప్రకటించిన సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

సమ్మిట్ నిర్వహణ, సమ్మిట్‌లో ఆవిష్కరించనున్న తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్-2047 తయారీపై ఆదివారం సచివాలయంలో మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

'తెలంగాణ ముఖచిత్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా క్రోడీకరించి తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్-2047 తెస్తున్నాం. అందులో మహిళలు, యువత, రైతులు, వివిధ సామాజిక వర్గాల ప్రజలను దృష్టిలోపెట్టుకుని రూపొందించిన ప్రణాళికలుంటాయి. గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలను భవిష్యత్ ప్రణాళికగా మార్చుకుని, 4 కోట్ల తెలంగాణ ప్రజలకు అద్భుతమైన అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని అందించడంలో భాగంగా పారదర్శకమైన పాలసీ డాక్యుమెంట్‌ను జాతికి అంకితం చేయబోతున్నాం. ప్రపంచ దేశాల్లోని దిగ్గజ కంపెనీలు మన యువ సంపదకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిపిస్తే బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతాం. దీంతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చగలుగుతాం.

ఈ డాక్యుమెంట్‌లో విజన్, స్ట్రాటజీ అనే రెండు ప్రధాన అంశాలుంటాయి. రాష్ట్రంలో పాలసీ పెరలసిస్ (నిర్లక్ష్యాత్మకత) నెలకొంటే పెట్టుబడులకు రక్షణ ఉండదు. రాష్ట్ర భవిష్యత్తుకు నష్టం చేకూరుతుంది. ప్రపంచ స్థాయి నిపుణులు, ఐఎస్‌బీ, నీతి ఆయోగ్‌తో పాటు లక్షలాది మందిని భాగస్వాముల్ని చేసి డాక్యుమెంట్ తయారు చేశాం. స్ట్రాటజీలో భాగంగా రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించాం. యూపీఏ చైర్ పర్సన్‌గా సోనియాగాంధీ, సీఎంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు ఓఆర్ఆర్), అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును నిర్మించుకున్నాం. ఇప్పుడు ఓఆర్ఆర్ లోపలున్న 2,170 చదరపు కి.మీల పరిధిలోని 'క్యూర్' ఏరియాను సర్వీస్ సెక్టార్ జోన్‌గా మార్చి జీసీసీ, ఐటీ రంగ పరిశ్రమలను ప్రోత్సహిస్తాం. ఇక్కడి నుంచి కాలుష్యకారక పరిశ్రమల తరలిస్తాం. చెరువులు, కుంటలు, నాలాల ప్రక్షాళన చేపడతాం. మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి, రోడ్ల విస్తరణ చేపడతాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

'ఓఆర్ఆర్ బయట రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్ 162 కి.మీ పొడవుతో ఉండగా, 320 కి.మీల పొడవుతో రానున్న ఆర్ఆర్ఆర్ నగరానికి రెండో మణిహారంగా మారబోతోంది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న ప్రాంతాన్నే పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్)గా విభజించి అభివృద్ధిపరచబోతున్నాం. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి పెట్టుబడులు రావడానికి అవసరమైన ప్రణాళికలు ప్యూర్ పాలసీలో ఉంటాయి. బెంగళూరు-హైదరాబాద్, హైదరాబాద్-అమరావతి, అమరావతి-చెన్నైల మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణంతో పాటు బుల్లెట్ ట్రెయిన్ ఏర్పాటుకు కేంద్రాన్ని సూత్రప్రాయంగా ఒప్పించాం.


ప్యూర్ జోన్‌ను మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించి ఇక్కడి ఉత్పత్తుల దిగుమతికి ప్రోత్సహిస్తాం. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి తోడుగా వరంగల్‌లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో కొత్త విమానాశ్రయాలను నిర్మిస్తాం. హైదరాబాద్-మచిలీపట్నం మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి ప్రధాని, ఏపీ సీఎంతో మాట్లాడగా అంగీకరించారు. ఇక ఆర్ఆర్ఆర్ బయటి ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్)గా విభజించి అభివృద్ధి చేస్తాం..' అని రేవంత్ చెప్పారు.

'మాకు పొరుగు రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటక, తమిళనాడు పోటీ కాదు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌తోనే పోటీ. వాటినే ఆదర్శంగా తీసుకుంటాం. ఆయా దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తాం. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం. అంతర్జాతీయ విద్యా సంస్థలను తీసుకొచ్చి నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం. 2047లో దేశం 100 ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాల జరుపుకునే సమయంలో 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం అభివృద్ధి చెందాలని, దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం ఉన్న రాష్ట్రం వాటాను 5 నుంచి 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం..' అని సీఎం వెల్లడించారు. కాగా మంత్రులతో కలిసి గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కానున్న సందర్భంగా డిసెంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన ఉత్సవాలను నిర్వహించనున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 1న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లో, 2న ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో, 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో, 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో, 5న వరంగల్ జిల్లా నర్సంపేటలో, 6న నల్లగొండ జిల్లా దేవరకొండలో నిర్వహించనున్న ఉత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. స్థానిక జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా హాజరవుతారన్నారు. కాగా 7వ తేదీన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు విద్యా వ్యవస్థ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రకటిస్తారని భట్టి తెలిపారు. 8, 9వ తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ ఉంటుందన్నారు.

గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను 8న సీఎం వివరిస్తారని, 9న తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047ను ఆవిష్కరిస్తారని చెప్పారు. సాధారణ ప్రజానీకం సందర్శన కోసం 10, 11, 12వ తేదీల్లో సైతం సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కొనసాగిస్తామన్నారు. ఇక ఉత్సవాల చివరి రోజు 13న ఫుట్‌బాల్ దిగ్గజం లయనల్ మెస్సీ హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడతారన్నారు. ఇలావుండగా..విజన్ డాక్యుమెంట్-2047 తయారీలో భాగంగా 4 లక్షల మంది ప్రజల అభిప్రాయాన్ని సేకరించామని, రాష్ట్ర జనాభాలో ఇది ఒక శాతమని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.

# నేటి కొత్త లిక్కర్ సేల్



(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్న వ్యాపారులకు డిసెంబరు 1 నుంచి లిక్కర్ సేల్ చేసేందుకు ఎక్సయిజ్ శాఖ అనుమతిని ఇస్తుంది. అందుకే కొత్తగా బెల్ట్ షాపు బిజినెస్ చేసేందుకు సిద్ధమైన వ్యాపారులు వాటిని సొంతం చేసుకునేందుకు రంగంలోకి దిగారు. అందుకోసం హైదరాబాద్‌కు వచ్చి రూలింగ్ పార్టీ లీడర్ల వద్ద లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది.

చాలా గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించేందుకు యువత ఉత్సాహం చూపుతున్నట్లు తెలిసింది. ఎక్కువ మొత్తంలో లాభాలు ఉంటాయనే ప్రచారంతో ఆ షాపులకు డిమాండ్ పెరుగుతున్నది. ప్రతి రోజూ కనిష్టంగా రూ. 2 వేలు, గరిష్టంగా రూ. 5 వేల వరకు ప్రాఫిట్ ఉంటుందని టాక్ ఉంది. పైగా పెట్టుబడి సైతం రూ.లక్షల్లో ఉండదు. రూ.10 నుంచి 15 వేలు పెడితే సరిపోతుంది. సాయంత్రం వరకు పెట్టుబడితో పాటే లాభం కూడా వస్తుంది. ఈ క్రమంలోనే బెల్ట్ షాపులను దక్కించుకునేందుకు యువత పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నట్టు తెలిసింది. స్థానికంగా ఉండే లిక్కర్ షాపుల వద్ద బెల్ట్ షాపు నిర్వాహకులు బల్క్‌గా మద్యం కొనుగోళ్లు చేస్తుంటారు. బాటిల్‌పై ఉండే ఎంఆర్‌పీ ధర కంటే అదనంగా రూ.40 నుంచి రూ.100 వరకు విక్రయిస్తుంటారు. గ్రామస్తులు సైతం మద్యం కోసం మండల కేంద్రానికో, పట్టాణానికో వెళ్లాల్సిన అవసరం ఉండదు. అందుకే బెల్ట్ షాపుల కోసం ఇంట్రెస్ట్ చూపుతున్నట్టు తెలిసింది.

నిజానికి ఒక గ్రామంలో ఎన్ని బెల్ట్ షాపులు ఉండాలి? అనే నిబంధనను ఎక్సయిజ్ శాఖ విధించలేదు. కానీ చాలా గ్రామాలు విచ్చలవిడిగా షాపులు నిర్వహించడాన్ని చెక్ పెట్టేందుకు స్వీయ నియంత్రణ పాటిస్తున్నాయి. ఒకటి లేదా రెండు షాపులకు మాత్రమే అనుమతి ఇవ్వాలని సొంతంగా రూల్స్ పెట్టుకున్నాయి. దీంతో అనుమతి తీసుకున్న షాపులు ప్రతి ఏటా కొంత మొత్తాన్ని గ్రామ పంచాయతీకి ఫీజు రూపంలో చెల్లించాలి. ఒకవేళ అనుమతి లేని షాపుల్లో మద్యం విక్రయిస్తే ఎక్సయిజ్ శాఖకు ఫిర్యాదు చేసి, కేసులు నమోదు చేయిస్తుంటారు. ప్రస్తుతం ఆ షాపులను దక్కించుకునేందుకే స్థానిక లీడర్లు మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది.

బెల్ట్ షాపులపై అటు పోలీసు, ఇటు ఎక్సైజ్ శాఖల నుంచి కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎందుకంటే బెల్ట్ షాపులను నియంత్రించేందుకు ఇంతవరకు ఎలాంటి యాక్షన్ ప్లాన్ లేదు. ఆ షాపుల నిర్వహణ వల్ల సర్కారుకు ఆదాయం సమకూరుతోందనే అభిప్రాయంలో ఉన్న అధికారులు పరోక్షంగా వాటిని నిర్వహించేందుకు ప్రోత్సహిస్తున్నారు. అలాగే రూలింగ్ పార్టీ లీడర్లు సైతం తమ సన్నిహితులకు మాత్రమే బెల్ట్ షాపులు ఇవ్వాలని అటు గ్రామపెద్దలకు, ఇటు ఎక్సయిజ్ అధికారులకు సంకేతాలు ఇస్తున్నారు. దీనితో తమ పార్టీ కేడర్‌కు ఏదో ఒక ఫేవర్ చేశామని సంతృప్తి పడుతున్నారు. ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఉండటంతో బెల్ట్ షాపుల ద్వారా పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించవచ్చనే ఆశతో గ్రామస్థాయి లీడర్లు షాపుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.




# ప్రతి నియోజకవర్గంలో మహిళా ఎంఎస్ఎంఈ పార్కులు

- మహిళా సాధికారత ఇంటి నుంచే ప్రారంభం
- "వీ హబ్ 2.0" – స్టార్టప్ ఎకోసిస్టమ్ ఏర్పాట్లు
- బ్యాంక్ రుణ సమస్యలకు పరిష్కార చర్యలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేక ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మహిళా సాధికారత ఇంటి నుంచే ప్రారంభం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. 201718 నుంచి 202324 వరకు మహిళా శ్రామికశక్తి 22 శాతం నుంచి 40.3 శాతంకు గణనీయంగా పెరుగుదల నమోదు చేసిందని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో మహిళా శ్రామికశక్తి 52.7 శాతంగా ఉందని, ఇది జాతీయ సగటు 45.2 శాతం కంటే అధికమని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మహిళా స్టార్టప్స్‌ను గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దేందుకు 'వీ హబ్ 2.0' రూపకల్పన చేస్తున్నామన్నారు. స్కిల్స్, టెక్నాలజీ, ఫైనాన్స్, మార్కెట్, మెంటార్షిప్ ఎకోసిస్టమ్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి చెప్పారు.

ఈ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధే సమాజ ప్రగతికి మార్గం చూపుతుందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు పేర్కొన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు బ్యాంకుల నుంచి రుణాలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని కూడా మంత్రి పేర్కొన్నారు. కుటీర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# వైద్య సేవలో వైరా లయన్స్ ఫస్ట్ ..

## శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్.. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన..

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 30, తెలంగాణ ముచ్చట్లు;** నిరు పేదలకు వైద్య సేవలు అందించడంలో డాక్టర్స్ అసోసియేషన్ వైరా లయన్స్ క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్ ముందు ఉన్నాయని వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ప్రశంసించారు. స్థానిక శారదా నర్సింగ్ హోమ్ నందు ఖమ్మం ప్రశాంతి హాస్పటల్ వారి సౌజన్యంతో వైరా డాక్టర్స్ అసోసియేషన్ లయన్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరం ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్ హెల్త్ క్యాంప్ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ కాపా మురలీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైరా లయన్స్ క్లబ్ లు ఈ మెగా హెల్త్ క్యాంపులో నిరుపేదలకు సేవలందించడం పట్ల అభినందించారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను నేను గమనిస్తూనే ఉన్నానని అనేకమందికి సేవలందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు సమాజంలో అన్ని వర్గాల వారిని ఆదుకుంటున్న ఏకైక స్వచ్ఛంద సంస్థ లయన్స్ క్లబ్బులని ఈ సందర్భంగా పేర్కొన్నారు లయన్స్ కంటి హాస్పిటల్ నుండి కంటి పరీక్షలు నిర్వహించి అనేకమందికి సేవలందించి ఆపరేషన్ లు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.



ప్రతి మనిషి సంపాదనలో ముందున్నారని డబ్బు ముఖ్యం కాదని మనం ఎంత సంపాదించినా ఆరోగ్య కన్న నించింది లేదని అన్నారు వైరా లయన్స్ క్లబ్ మరియు డాక్టర్స్ అసోసియేషన్ వాళ్ళందర్నీ ప్రత్యేకంగా అభినందించారు డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుడాక్టర్ దారెల్లి కోటయ్య లయన్స్ క్లబ్బులు సంయుక్త నిర్వహించి ఉచితంగా రోగులకు అందుబాటుకు తేవడం అభినందనీయమని అన్నారు. ఈ వైద్య శిబిరాన్ని పట్టణ ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు అనంతరం డాక్టర్ కాపామురళి కృష్ణ మాట్లాడుతూ డాక్టర్స్ అసోసియేషన్ వైరా లయన్స్ క్లబ్ ల నుండి మరిన్ని సేవా కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు మరెన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పరీక్షలు చేయించుకున్నారు.ఈ ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది ఖమ్మంకు చెందిన ప్రశాంతి హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వారద విజయ్ కుమార్ హాజరై రోగులను పరీక్షించారు వీరిలో కొంతమందికి గుండెకు సంబంధించిన వ్యాధులు ఉన్నట్లు నిర్ధారించారు. గుండెకు సంబంధించిన పరీక్షల్లో 190 మందికి పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో ప్రశాంతి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కేసోజు భరత్ బాబు డాక్టర్స్ డి బసవయ్య చౌదరి చనుమోలు ప్రవీణ్ కృష్ణ ప్రసాద్ హార ప్రదీప్ రాయిని పాటిబండ్ల హేమంత్ రాజకుమార్ చింతపల్లి పయ్యావుల కిషోర్ కుమార్ వివిధ విభాగాలకు చెందిన రోగులను పరీక్షించారు. ఈ మెగా వైద్య శిబిరం నందు దాదాపు 600మంది రోగులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ వైరా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ దారెల్లి కోటయ్య ట్రెజరర్ డాక్టర్ నీల సతీష్ కుమార్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు డాక్టర్స్ తుమ్మ శ్రీనివాస్ రెడ్డి స్టీరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి లగడపాటి ప్రభాకర్ రావు ఉంద్రు శ్యాంబాబు డాక్టర్ దారిల్లి హరిత రీజన్ చైర్మన్ నగేష్ జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై బుచ్చి రామారావు గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు జాల పుల్లారావు సెక్రెటరీ చెరుకూరి శ్రీనివాసరావు గంగవరపు కిషన్ రాయి మాదినేని సునీత తదితరులు నూకల శ్రీనివాసరావు నూకల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.





# విజయవంతమైన ‘రండి మసీదును సందర్శించండి’ కార్యక్రమం..

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 30, తెలంగాణ ముచ్చట్లు;** జమాతే ఇస్లామీ హింద్ సెంట్రల్ శాఖ, ముతవల్లి జామా మస్జీద్ సముక్త ఆధ్వర్యంలో ఆదివారం అన్యమతస్తులను ఆహ్వానించి కమాన్ బజార్ లోని జామియా మసీదులో రండి... మసీదును సందర్శించండి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండింటి వరకు కమాన్ బజార్ లోని హిందూ సోదరులను మరియు క్రైస్తవ సోదరులను ప్రేమపూర్వకంగా మసీదుకు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా వారికి మసీదును చూపించి నమాజ్ ఆచరణ విధానం , వుజూ చేసే విధానాన్నివివరించడం జరిగింది. ఈ సందర్భంగా సందర్శకులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సందర్శకులు ఈ వినూత్న కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇలా మసీదును సందర్శించడం చాలా ఆనందంగా ఉందని ఇలాంటి కార్యక్రమాల వల్ల సమాజంలో సోదర భావం మతసామరస్యం పెంపొందడంతోపాటు అపార్థాలు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ఇలియాస్ ,జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్, జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా ,ఉపాధ్యక్షులు అబ్దుల్ సమి, సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్ , నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్, ,జిల్లా మీడియా సెక్రెటరీ అబ్దుల్ మలిక్ ,జామా మస్జిద్ బాధ్యులు మహేమూద్ , హంజా, ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఖాసిం,ఐట రీజనల్ సెక్రెటరీ మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్ సభ్యులు ఖలీల్ అహ్మద్ ఖాన్,ఫయాజ్,షేక్ ఇలియాస్, నజముద్దిన్ ,అబ్దుల్ రజాక్, గౌస్,ఎజాజ్, యాసర్ అహ్మద్, గఫూర్, కబీర్ ఖాన్ మరియు ముస్లిమేతర సోహుదర్లు పాల్గొన్నారు.



# నా బిడ్డకు సాయం చేసి ప్రాణం పోయండి..

**ప్రాణాప్రాయంతో కొట్టుమిట్టాడుతున్న కూతురిని కాపాడాలని తల్లి వేడుకోలు..**


**ఖమ్మం బ్యూరో, నవంబర్ 30, తెలంగాణ ముచ్చట్లు;** తన కూతురు ప్రాణాంతకరమైన వ్యాధితో బాధపడుతుందని, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తే నిండు ప్రాణాన్ని కాపాడుకోవచ్చునని ఓ తల్లి వేడుకుంటుంది. వివరాల ప్రకారం తల్లాడకు చెందిన కుసుమరాజు లక్ష్మి తన కూతురుకు వివాహమైంది. ఇటీవల ఆమె ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతోంది. గుండె, మెదడుకు మధ్యలో ప్రమాదకరమైన రక్త గడ్డ ఉందని, అది రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుందని, దీంతో ఆమె ప్రాణానికి ప్రమాదం ఉందని డాక్టర్లు చెప్పారని తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్ పై వైద్యాన్ని అందిస్తున్నారని, కళ్యాణికి నిరంతరం వెంటిలేటర్ సపోర్టు, ఐరిస్క్ రక్త గడ్డలను కరిగించే ట్రీట్మెంట్ అవసరం ఉందని డాక్టర్లు తెలిపారని ఆమె చెప్పారు. వీటిని రక్త గడ్డలను కరిగించేందుకు ఆపరేషన్ కు సుమారు 10 లక్షలు ఖర్చు అవుతుందని, ఇప్పటివరకు తాము కొంత అప్పులు తీసుకొచ్చి బిడ్డను కాపాడుకున్నామని, ప్రస్తుతం తమ దగ్గర ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలిపారు. దాతలు ముందుకొచ్చి నా బిడ్డను ఆదుకోవాలని వేడుకుంటుంది. ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న నా బిడ్డను స్వచ్ఛంద సంస్థలు, సేవా హృదయం ఉన్న వారు ముందుకు వచ్చి కాపాడాలని ఆమె విన్నవిస్తోంది. ఎవరైనా సాయం చేయాలనుకున్న దాతలు అకౌంట్ నెంబర్ 109810011003038.. ఫోన్ పే లేదా గూగుల్ పే చేయాలని లక్ష్మి వేడుకుంటుంది.

# అయినవోలు పద్మశాలి సంఘం మండలాధ్యక్షులుగా గోరంట్ల కుమారస్వామి



**పాలకుర్తి , 30 నవంబర్ ( తెలంగాణ ముచ్చట్లు ):** అఖిల భారత పద్మశాలి అనుబంధం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అయినవోలు మండల అధ్యక్షులుగా గోరంట్ల కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికై సూరత్ కు వచ్చిన సందర్భంగా సోమేశ్వర టెక్స్టైల్ అండ్ మ్యానుఫ్యాక్చరర్ వీవర్స్ అసోసియేషన్ వారు గోరంట్ల కుమారస్వామికి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. సోమేశ్వర అసోసియేషన్ ఉపాధ్యక్షులు కైరం కొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వన్నాల ప్రకాష్, కోశాధికారి జిగిజర్ల రమేష్, కమిటీ సభ్యులు సామల శ్రీనివాస్, కోట అంబదాసు, వెంగల్ దాస్ రవి, కుసుమ అశోక్, సభ్యులు బొప్పరాతి రమేష్, కైరం కొండ సురేందర్, పాము శీను, వెన్నం అనిల్, సామల సుధాకర్, పొన్నాల సోమయ్య, పొట్ట బత్తిని శ్రీనివాస్, చిలుకమారి సాయిప్రసాద్, వేముల వినయ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హంసు వర్మ వివాహానికి హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**పెద్దమంద,నవంబర్30(తెలంగాణ ముచ్చట్లు):** హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది మరియు పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన హంసువర్మ వివాహానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.కొత్తకోట మండల కేంద్రంలోని ఏటీఆర్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఈ వివాహ వేడుకలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని వధూవరులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దాంపత్య జీవితం పరస్పర ప్రేమాభిమానాలు, పరస్పర గౌరవంతో ముందుకు సాగితే చిరకాలం సుఖశాంతులు చేకూరుతాయి. మీ కొత్త జీవిత ప్రయాణం ఆనందం-ఆశీర్వాదాలతో నిండిపోవాలి అని హృదయపూర్వక ఆశీస్సులు అందించారు.

వధూవరుల భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.ఈ వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హంసు వర్మ-రాధికల వివాహ వేడుకల్లో పాల్గొన్న జిల్లెల చిన్నారెడ్డి



**పెద్దమందడి,నవంబర్30(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు, హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది హంసు వర్మ వివాహం కొత్తకోటలోని ఏటీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హంసు వర్మ - రాధికల వివాహానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి వధూవరులకు అక్షింతలు వేసి,నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో,సౌఖ్యసంపదలతో, సుఖశాంతులతో దాంపత్య జీవితం సాగాలని దేవుడు దీవించాలి అని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాబా ,వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,

వనపర్తి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్,మదనపురం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పల్లెపాగా ప్రశాంత్,చిన్నమందడి కురుమూర్తి,సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు,అలాగే బంధుమిత్రులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక





# కాంగ్రెస్ పథకాలే ఆకర్షణ...నేతల భారీ చేరిక

## ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట, నవంబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని, ఆ ప్రభావంతో వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు వస్తున్నారని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట మండలంలో కావడిగుండ్ల, కంట్లం, గోపన్నగూడెం గ్రామాల నుంచి పలువురు నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి జారె కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ప్రజల మనసు గెలుచుకుంటున్నాయని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయి అండగా ఉంటాం... సేవా భావం ఉన్న వారికి కాంగ్రెస్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి అని తెలిపారు. చేరికలతో పార్టీ మరింత బలపడిందని, గ్రామస్థాయి నుంచి ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు వెలిబుచ్చుతున్నారని జారె స్పష్టం చేశారు.



# పుట్టినరోజు పేదలకు అన్నం పాకెట్ల పంపిణీ

- బీజేవైఎం నాయకుడు జక్కుల కిరణ్ ముదిరాజ్

**మల్కాజ్‌గిరి, నవంబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** బీజేవైఎం రాష్ట్ర నాయకుడు జక్కుల కిరణ్ ముదిరాజ్ తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మల్కాజ్‌గిరి వినాయకనగర్ డివిజన్‌లో సేవా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పేద మరియు అవసరమైన వారికి అన్నం పాకెట్లను పంపిణీ చేశారు. కిరణ్ ముదిరాజ్ మాట్లాడుతూ, "సామాజిక సేవ జీవన ధ్యేయం. పుట్టిన రోజును వేడుకగా కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా జరపడం నాకు ఆనందంగా ఉంటుంది" అని చెప్పారు. ప్రాంతంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఉన్న నేపథ్యంలో తాము చేపడుతున్న చిన్న ప్రయత్నం వారికి కొంత ఉపశమనాన్ని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. పలువురు స్థానిక ప్రజలు ఈ కార్యక్రమానికి హర్షాన్ని వ్యక్తం చేశారు. పేదలకు సమయానుకూలంగా సహాయం అందించడం ప్రశంసనీయం అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు కార్యకర్తలు ముందుండి సహకరించారు. ఈ సేవా కార్యక్రమంలో జక్కుల కిరణ్ ముదిరాజ్‌తో పాటు పంజాబ్ శ్రీకాంత్ యాదవ్, స్థానిక బీజేపీ నేతలు, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.





# ఈసీఐఎల్‌లో సోలిస్ ఐ హాస్పిటల్... సిబ్బందితో అవార్డు వేడుకలు

**ఏ ఎస్ రావు నగర్, నవంబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** సోలిస్ ఐ హాస్పిటల్ చైర్మన్ నందనంపాటి రామాంజనేయులు (రాము) టైమ్స్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీతగా నిలవడంతో ఆయనకు ప్రవచన చక్రవర్తి పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అభినందనలు తెలిపారు. తొమ్మిది సంవత్సరాల క్రితం ఈసీఐఎల్‌లో సోలిస్ ఐ హాస్పిటల్‌ను ప్రారంభించిన రాము, సేవల ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పొందడమే కాకుండా, నగరంలో మరో మూడు బ్రాంచులను స్థాపించి విశేషమైన పేరును సంపాదించారు. ఈ ఏడాది ఈవైఈ హాస్పిటల్స్ కేటగిరీలో భారతదేశంలో 4వ స్థానంతో పాటు, ఏపీ & తెలంగాణలో 2వ స్థానాన్ని సోలిస్ ఐ హాస్పిటల్ దక్కించుకుంది. ఈ అవార్డులను మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ, తెలంగాణ మాజీ ఆరోగ్య మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా రాము స్వీకరించారు. ఈసీఐఎల్‌లో సిబ్బందితో కలిసి నిర్వహించిన అవార్డు వేడుకలో ముఖ్య అతిథులుగా పద్మశ్రీ గరికపాటి నరసింహారావు దంపతులు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు పాల్గొన్నారు.

ఈ సందర్భంలో గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ: "సర్వేంద్రియానాం నయనం ప్రధానం. కాళ్లు లేకున్నా నడవలేమేమో కానీ బ్రతికేయొచ్చు, చేతులు లేకున్నా జీవనం సాగించవచ్చు, కానీ కళ్లువెలుగు లేకుంటే ప్రపంచం చీకటిలోకి వెళ్లిపోతుంది. అలాంటి వెలుగును వేలాది మందికి అందిస్తున్న రాము సేవలు అపూర్వం," అని ప్రశంసించారు.

అలాగే రాము చేపడుతున్న చలివేంద్రాలు, అన్నదానాలు, ఆధ్యాత్మిక సేవల గురించి ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శివరామకృష్ణ, విజయేందర్ రెడ్డి, మహేష్, భాస్కర్, మోహన్, సుబ్బారావు, నీరజ, విజయలక్ష్మి గుంటూరు ఉమా తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ రాశి భూములను వెలికి తీయాలని ఆదేశించిన సబ్–కలెక్టర్

**సత్తుపల్లి, నవంబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండలం కుంచపర్తి గ్రామంలో గ్రామ రాశి భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్న సమాచారం నేపథ్యంలో రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో కల్లూరు సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్ ఆదివారం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. సర్వే నంబర్ 91లో మొత్తం 135 ఎకరాల గ్రామ రాశి భూమికి స్పష్టమైన సరిహద్దులు నిర్ణయించే పనులను అధికారులు చేపట్టారు. ఇందుకోసం నాలుగు అడుగుల లోతు, మూడు అడుగుల వెడల్పుతో ప్రత్యేకంగా కాలువ తవ్వకాలు జరుపుతున్నారు. సరిహద్దులు స్పష్టంగా ఉండడం వల్ల భూములను అక్రమంగా ఆక్రమించే ప్రయత్నాలు నిలిచిపోతాయని అధికారులు తెలిపారు.

సమయంలో, ఇతర సర్వే నంబర్లలో కూడా గ్రామ రాశి భూములు ఉన్నట్లు గుర్తించిన సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్, అవన్నీ కూడా వెలికితీయాలని సర్వేయర్‌కు ఆదేశించారు.





# ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**సత్తుపల్లి, నవంబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించేందుకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మర్లపాడు, కుంచపర్తి గ్రామాల్లోని ఐకెపి, సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు తీసుకొచ్చిన ధాన్యం కాటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా ధాన్యం కాటాలు వేయాలి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలి అని స్పష్టం చేశారు. రాబోయే రెండు రోజుల పాటు తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రైతులు తమ ధాన్యాన్ని టార్పాలిన్స్‌తో కప్పి తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. తనిఖీలలో తహశీల్దార్ మాణిక్‌రావు, వ్యవసాయ అధికారి పచ్చల రాంమోహన్, రెవెన్యూ అధికారులు, జీపీఓలు, ఐకెపి మరియు సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.



# గురజాడ అప్పారావు 110వ వర్ధంతి

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో నివాళులర్పణ

**ఏ ఎస్ రావు నగర్, నవంబర్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కమలానగర్ ఆఫీసులో ప్రముఖ ప్రజాకవి గురజాడ అప్పారావు 110వ వర్ధంతి సందర్భంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా ఎన్ఎఫ్‌సి మాజీ నాయకులు ఉదయ భాస్కర్, సామాజిక ఉద్యమ నాయకులు పి. మల్లేశం గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ సిహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ, "తెలుగు భాష అభ్యున్నతికి వాడుక భాషను అందరికీ అందుబాటులోకి తెచ్చినవారు గురజాడ అప్పారావు" అని పేర్కొన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గట్టి పోరాటం చేసి, అప్పటి కన్యాశుల్కం వంటి సామాజిక దురాచారాలను వెలికి తీసి "కన్యాశుల్కం" నాటకం ద్వారా సమాజానికి విలువైన సందేశాన్ని అందించారని అన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్" అని చెప్పిన ఆయన రచనలు నేటికీ స్ఫూర్తిదాయకమని గుర్తించారు. అధ్యక్షులు గొడుగు యాదగిరి రావు మాట్లాడుతూ, గురజాడ అప్పారావు ప్రగతిశీల ఆలోచనలకు వ్యతిరేకంగా అప్పటి మనువాదులు అనేక కుట్రలు పన్నినా, ప్రజలు మరియు ప్రజాతంత్ర వాదులు ఆయన రచనలను ముందుకు తెచ్చి ప్రజల్లోకి చేర్చారని తెలిపారు. నేటి పరిస్థితుల్లో కూడా మతమతాల మధ్య విభేదాలను దాటుకుని, "మతములన్నీ మాసిపోవును జ్ఞానం ఒక్కటే నిలిచి ఉండును" అన్న గురజాడ ఆశయాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. తరువాత దేశ భక్తి గీతంతో కార్యక్రమం ముగిసింది. చివరగా సభ్యులందరూ గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

ఈకార్యక్రమంలో జి. శివరామకృష్ణ, శ్రీనివాసరావు, ఉన్నికిష్ణన్, వెంకటేశ్వరరావు, మల్లేశం, సింధు, వేణుమాధవ్, అన్నపూర్ణ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు

ఎస్సై సురేష్

**వేలేరు, 30 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాలలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వేలేరు ఎస్సై సురేష్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రత్యర్థులను అవమానించే విధంగా వ్యాఖ్యలు, పోస్టులు, వీడియోలు లేదా దుష్ప్రచారం చేస్తే చట్టపరమైన కేసులు తప్పవని తెలిపారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి పోస్టులను షేర్ చేసినా నేరంగానే పరిగణించి గ్రూప్ అడ్మిన్‌లను కూడా బాధ్యులుగా తేలుస్తామని ఎస్సై అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా సోషల్ మీడియాను ఉపయోగించాలని సురేష్ సూచించారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# ప్రతిభావంతులైన భారతీయులతో అమెరికా ఏళ్లుగా ప్రయోజనం పొందింది: ఎలాన్ మస్క్

అపార ప్రతిభ గల భారతీయులను నియమించుకొని కొన్నేళ్లుగా అమెరికా చాలా ప్రయోజనాలను పొందిందని టెస్లా అధినేత, అపర కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నారు. జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ తన పాడ్ కాస్ట్ 'పీపుల్ బై డబ్ల్యూటీఎఫ్'లో పాల్గొన్న మస్క్ పలు విషయాలు పంచుకున్నారు. ప్రతిభావంతులను నియమించుకునేందుకు తీసుకొచ్చిన హెచ్ 1బీ వీసా దుర్వినియోగం ఇటీవల అమెరికాలో పెరుగుతున్న వలస వ్యతిరేక భావనకు కొంతమేర కారణమైనట్లు ఆయన అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వాలు చూసీచూడనట్లు ఉండడం వల్లే ఇలా జరిగిందని పేర్కొన్నారు. వలసలు, వీసాల దుర్వినియోగం, అమెరికాలో స్థిర నివాసం తదితర విషయాలపై ఇటీవల కాలంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న తరుణంలో మస్క్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

గత అధ్యక్షుడు బైడెన్ పరిపాలనలో సరిహద్దుల్లో ఎలాంటి నియంత్రణ లేదని, దీంతో అక్రమ వలసలు పెరిగినట్లు మస్క్ పేర్కొన్నారు. వలస వ్యతిరేక భావనలపై ఇది ప్రతికూల ప్రభావం చూపినట్లు వెల్లడించారు. అమెరికాకు అక్రమంగా వచ్చిన వారు ప్రభుత్వ ప్రయోజనాలు పొందడం.. వలసలు పెరగడానికి దోహదం చేస్తుంది. అక్రమంగా వలస వచ్చిన వారికి ప్రభుత్వ ప్రయోజనాలు అందకుండా చూడాలి. వలసల కట్టడికి సరిహద్దుల వద్ద నియంత్రణ కచ్చితంగా పాటించాలి. లేకుంటే హాస్యాస్పదంగా ఉంటుందని మస్క్ అన్నారు.

ప్రతిభావంతుల కొరత ఎప్పుడూ ఉంటుందని, కొన్ని కష్టమైన లక్ష్యాల కోసం ప్రతిభావంతుల నియామకం తప్పనిసరి మస్క్ పేర్కొన్నారు. అయితే కొన్ని కంపెనీలు ఖర్చు తగ్గింపుపైనే దృష్టి పెడతాయని, ఒక అమెరికన్ ఉద్యోగికి చెల్లించాల్సిన జీతంతో పోలిస్తే ఇతర దేశాల ఉద్యోగులు తక్కువ జీతానికి దొరికితే కంపెనీలు వారినే నియమించుకుంటాయన్నారు. తన కంపెనీలు అయిన టెస్లా, స్పేస్ ఎక్స్, ఎక్స్ (ట్విటర్) ప్రతిభావంతులను తీసుకోవడానికి చూస్తాయని, వారికి సగటు కంటే ఎక్కువ జీతాలు అందుకుంటారని తెలిపారు. కొన్ని ఔట్‌సోర్సింగ్ కంపెనీలు హెచ్ 1బీ వీసాల వ్యవస్థను దెబ్బతీశాయి. ఈ వ్యవస్థను అరికట్టాల్సిన అవసరం ఉంది. అయితే హెచ్ 1బీ వీసాలను ఆపేయాలని తాను పేర్కొనలేదని మస్క్ వివరించారు. ఇక అమెరికాలో ఉద్యోగం కోసం కలలుకంటున్న భారతీయులను ఉద్దేశించి మస్క్ మాట్లాడుతూ.. ఎవరైతే తాము తీసుకుంటున్నదాని కంటే సమాజానికి ఎక్కువగా ఉపయోగపడతారో వారిని తాను గౌరవిస్తానన్నారు. సమాజానికి ఎప్పటికీ ఒక సహాయకారిగా ఉండాలని, తాము పొందే ప్రయోజనాల కంటే సమాజానికి ఇచ్చే దానిపైనే ఎక్కువగా దృష్టి సారించాలని మస్క్ సూచించారు.

# నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ డీసీపీ లా & అర్డర్







**ఖమ్మం బ్యూరో, నవంబర్ 30, తెలంగాణ ముచ్చట్లు;** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను అదనపు డిసిపి (లా&ఆర్డర్) ప్రసాద్ రావు సందర్శించారు. నేలకొండపల్లి, ముజ్జిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తుతో నిశితంగా పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# బ్యాంకు రూల్స్ తెలిస్తే బిందాస్




విద్యార్థి నుంచి ఉద్యోగి దాకా.. రైతు నుంచి వ్యాపారి వరకు దాదాపు అందరికీ బ్యాంకు ఖాతాలున్నాయి. తెల్లవారింది మొదలు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం అంటూ అగ్గిపెట్టె నుంచి అత్యవసర వస్తువు దాకా ఏది కొనాలన్నా వాటినే వాడేస్తున్నాం. మనిషి మనుగడలో ఇంతలా మమేకమైన డబ్బు యంత్రాన్ని నడిపించే బ్యాంకు సేవలపై ఎక్కువ శాతం వినియోగదారులకు పూర్తి స్థాయి అవగాహన అంతంత మాత్రమే. దీంతో నష్టపోతున్నవారు, కష్టపడుతున్నవారు కోకొల్లలు.. బ్యాంకు నియమాలు తెలుసుకుంటే ఎన్నో లాభాలను ఖాతాలో వేసుకోవచ్చు.

డెబిట్ కార్డు ఉన్న వారికి బ్యాంకులే ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నాయి. రూపే, వీసా, మాస్టర్, ఇతర ప్రీమియం కార్డులను బట్టి బీమా మొత్తం మారుతూ ఉంటుంది.. బీమా రూ.2లక్షల నుంచి 10లక్షల వరకు ఉంటుంది. మరణానికి ముందు 90 రోజుల్లో ఒక్కసారైనా కార్డును వినియోగించి ఉండాలి. మృతుని కుటుంబసభ్యులు 30 రోజుల్లోగా బ్యాంకుకు వెళ్లి బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు ప్రమాదంలో చనిపోయినట్లు పోస్ట్‌మార్టం నివేదిక, ఎఫ్ఐఆర్ కాపీ, మరణ ధ్రువపత్రం, పాన్, ఆధార్ కార్డులు, మృతుడి డెబిట్ కార్డు జిరాక్స్ బ్యాంకులో ఇవ్వాలి. మరణంపై అధికారులు విచారణ చేసి నిర్ధారణ అయితే 10 రోజుల్లోగా బీమా సొమ్ము కుటుంబ సభ్యులకు అందజేయాలి.

సేవింగ్స్ ఖాతాదారుడికి ఇప్పటివరకు ఒక్కరే నామినీగా ఉన్న నిబంధనను సడలించి ఆ స్థానంలో నలుగురిని చేర్చారు. ఖాతాదారుడు, నామినీ ఇద్దరూ మరణించిన కొన్ని సందర్భాల్లో ఆ సొమ్మును తీసుకోవాలంటే కుటుంబసభ్యులు ముప్పుతిప్పలు పడాల్సిందే. ఇటీవల అమల్లోకి వచ్చిన నూతన నిబంధనతో మరణించిన వారి ఖాతాల్లోని సొమ్ము సులభంగా నామినీలకు చేరుతుంది.

ఏటీఎంలో నగదు రాకుండానే కట్ అయినట్లు సందేశం వస్తే వెంటనే బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఎక్కువ సందర్భాల్లో ఫిర్యాదు చేసిన ఐదు రోజుల్లోగా డబ్బు వెనక్కి వస్తుంది. లేనిపక్షంలో ఆలస్యమైన ఒక్కో రోజుకు రూ.100 చొప్పున ఖాతాదారుడికి బ్యాంకు పరిహారం చెల్లించాలి.

రుణం తీసుకునే సందర్భంలో ఆస్తి పత్రాలను పూచీగా పెట్టుకుని మార్ట్‌గేజ్ చేస్తారు. రుణం చెల్లించిన 30 రోజుల్లోగా గ్రహీతకు ఆస్తి పత్రాలను తిరిగి ఇవ్వాలి. కానీ కొన్ని బ్యాంకులు ఆలస్యం చేస్తుంటాయి. అయితే, 31వ రోజు నుంచి రోజుకు రూ.5వేల చొప్పున బ్యాంకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

బ్యాంకులో చెక్కు మార్చి ఖాతాలో సొమ్ము జమ చేయడానికి 48 గంటలుగా ఉన్న కాల పరిమితిని 24 గంటలుగా మార్చారు. చాలా బ్యాంకుల్లో ఇప్పటికీ చెక్ జమ చేసేందుకు ఆలస్యం చేస్తున్నారు. దీన్ని మనం ప్రశ్నించొచ్చు.

ప్రకృతి వైపరీత్యాలు, ఖాతాదారుల నిర్లక్ష్యం వల్ల బ్యాంకు లాకర్‌లో పెట్టిన వస్తువులకు నష్టం వాటిల్లితే, దానికి బ్యాంకులు బాధ్యత వహించవు. అగ్ని ప్రమాదం, ఉద్యోగుల నిర్లక్ష్యం, భవనం కూలిపోవడం, బ్యాంకు ఆవరణలో దొంగతనం జరగడం కారణంగా జరిగిన నష్టాలకు కూడా పూర్తి బాధ్యత ఉండదు. బ్యాంకు వైఫల్యాన్ని నిరూపించగలిగితే లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు సొమ్ము పరిహారంగా ఇస్తారు. ఉదాహరణకు లాకర్ అద్దె ఏడాదికి రూ.3000 అనుకుంటే ప్రమాదం జరిగితే పరిహారం కింద రూ.3లక్షలు చెల్లిస్తారు.

ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సేవింగ్స్ ఖాతాలకు కనీస నగదు నిబంధనలు లేవు. సాధారణ కార్డులున్న వారు ఏటీఎంలో బ్యాంకు నిబంధనను బట్టి రోజుకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. కొన్ని ప్రీమియం కార్డుల్లో పరిమితి రూ.2 లక్షల వరకు ఉంటుంది. యూపీఐ విధానంలో బదిలీ పరిమితి రూ.1లక్ష ఉంది.

ఖాతాదారులు సొంత బ్యాంకు ఏటీఎంలో నెలకు 5సార్లు, ఇతర బ్యాంకు ఏటీఎంల్లో 3 సార్లు మించి నగదును విత్‌డ్రా చేస్తే రూ.23 ఛార్జ్ పడుతుంది.

ఖాతా తెరిచిన తర్వాత ఆయా బ్యాంకుల కాలపరిమితి ప్రకారం ఖాతాదారులు రీకేవైసీ చేయించుకోవాలి. ఆధార్, పాన్ ఉంటే సదరు బ్యాంకు బ్రాంచిలోనే ఖాతాను నవీకరిస్తారు. లేనిఎడల కాల పరిమితి ముగియగానే ఖాతా నిలిచిపోతుంది. మళ్లీ అప్‌డేట్ చేయించుకునే వరకు ఎలాంటి లావాదేవీలు చేయలేము.

బ్యాంకులో ఎదురైన ఇబ్బందులు, నష్టాలపై ఫిర్యాదు చేసిన నెల రోజుల్లోగా సంబంధిత అధికారుల నుంచి సరైన స్పందన రాకుంటే ఆర్‌బీఐ ఏర్పాటుచేసిన అంబుడ్స్‌మెన్ అనే న్యాయవ్యవస్థను సంప్రదించవచ్చు. టోల్ ఫ్రీ నంబర్ 14448కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయవచ్చు. ఆన్‌లైన్ పోర్టల్ https://cms.rbi.org.in, ఈమెయిల్ 'crpc@rbi.org.in లో కూడా ఆర్థిక లావాదేవీలపై ఫిర్యాదు చేయవచ్చు.

# భానుడి తాకిడికి ఎ320 విమానాల విలవిల!

చిన్నపాటి పక్షుల ఢీ ఘటనల పట్లే కాకుండా చిన్నపాటి సాఫ్ట్‌వేర్ వైరుధ్యాల విషయంలోనూ విమాన సంస్థలు అప్రమత్తంగా ఉండాలని జెట్‌బ్లూ సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఎ320 ఎయిర్‌క్రాఫ్ట్ ఉదంతం స్పష్టం చేస్తోంది. అక్టోబరు 30న ఈ లోహవిహంగం పైలట్ ప్రమేయం లేకుండానే అనూహ్యంగా ఆకాశం నుంచి కిందకి జారిపోవడం మొదలైంది. ఎయిర్‌క్రాఫ్ట్‌లోని సాఫ్ట్‌వేర్‌పై తీవ్రస్థాయి సౌరరేడియోధార్మికత ప్రభావం చూపడమే దీనికి కారణమని తేలడం నిపుణులను విస్మయానికి గురిచేసింది. విమాన డిజైన్ సమయంలో మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతను ఇది సూచిస్తోంది.

**ఎందుకీ సమస్య?**

ఎ320 విమానాన్ని తొలిసారిగా 1984లో ప్రవేశపెట్టారు. ఫ్లైబైవైర్ అనే కంప్యూటరైజ్డ్ ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థ కలిగిన తొలి వాణిజ్య ఎయిర్‌క్రాఫ్ట్‌గా ఇది గుర్తింపు పొందింది.

నింగిలో ఈ విమాన గమనాన్ని మార్చాలనుకున్నప్పుడు పైలట్.. కాక్‌పిట్‌లోని నియంత్రణ వ్యవస్థలను నిర్దేశిత రీతిలో కదిలిస్తారు. దీనికి అనుగుణంగా కంట్రోల్ వ్యవస్థలు ఎలక్ట్రానిక్ సంకేతాలను పంపుతాయి. ఈ సంకేతాలను ఎలివేటర్ అండ్ ఎయిలిరాన్ కంప్యూటర్ (ఈల్యాక్) ప్రాసెస్ చేస్తుంది. పైలట్ నిర్దేశానికి అనుగుణంగా ఎలివేటర్లు, ఎయిలిరాన్లను సర్దుబాటు చేస్తుంది. ఎలివేటర్‌లో కదలికల ద్వారా విమానాన్ని పైకి లేదా కిందకి వెళ్లేలా చేయవచ్చు. ఎయిలిరాన్లలో మార్పుల ద్వారా ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఎడమ లేదా కుడి వైపునకు మళ్లించొచ్చు. మొత్తంమీద ఈల్యాక్ వ్యవస్థ అనేది ఎలివేటర్, ఎయిలిరాన్లను నియంత్రించే మెదడు లాంటిది. ఇది గందరగోళానికి లోనైతే పైలట్ ప్రమేయం లేకుండానే ఈ రెండు వ్యవస్థల్లో మార్పులు జరిగి, విమాన గమనంలో ఆకస్మిక మార్పులు రావొచ్చు. ఫలితంగా ఎయిర్‌క్రాఫ్ట్ ఆకృతి పటిష్ఠతపై కూడా ప్రభావం పడొచ్చు.

బోయింగ్ సంస్థకు చెందిన 737 మ్యాక్స్ విమానాల్లోనూ ఫ్లైట్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌లో లోపాలు తలెత్తి, ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆ శ్రేణి విమానాలను సుదీర్ఘ సమయం పాటు నిలిపివేశారు.

**సాఫ్ట్‌వేర్‌లో లోపంతో..**




ఎయిర్‌బస్‌కు చెందిన ఎ320 తరగతి విమానాల్లో ఎల్104 అనే సాఫ్ట్‌వేర్ వెర్షన్‌ను ప్రవేశపెట్టారు. ఈ సాఫ్ట్‌వేర్ తీవ్రస్థాయి సౌర జ్వాలల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు తాజాగా పేర్కొన్నారు. దీనివల్ల.. అసాధారణ సందర్భాల్లో పైలట్ ప్రమేయం లేకుండానే ఎలివేటర్, ఎయిలిరాన్లలో ఆకస్మిక మార్పులు జరగొచ్చని తేల్చారు. జెట్‌బ్లూ విమానంలో ఎలివేటర్ ఇదేరీతిలో ఆకస్మికంగా మారడంతో విమానం వేగంగా కిందకి దిగిందని పేర్కొన్నారు. ఈ పరిణామం కొద్దిసేపే సాగింది. అయితే ఈ క్రమంలో విమాన డిజైన్ పరిమితులను అది దాటిపోయింది. ఈలోగా ఎయిర్‌క్రాఫ్ట్‌లోని ఆటోపైలట్.. దాని ప్రయాణ మార్గాన్ని సరిచేసింది.

**ఏమిటీ సౌరజ్వాలలు?**

సూర్యుడి నుంచి వచ్చే ఆవేశిత రేణువులు, విద్యుదయస్కాంత తరంగాలను సౌర రేడియోధార్మికతగా పేర్కొంటారు. ఇందులో దృశ్యకాంతి, అతినీల లోహిత కిరణాలు, ప్రొటాన్లు, ఎలక్ట్రాన్లు వంటి ఆవేశిత రేణువులు ఉంటాయి. కొన్నిసార్లు సూర్యుడి నుంచి విస్ఫోటంలా తీవ్రస్థాయి జ్వాలలు, సౌర తుపాన్లు వెలువడతాయి. ఆ సమయంలో సౌర రేణువులు.. కాంతి వేగంతో భూమిని తాకుతాయి. అయితే భూమికి సంబంధించిన అయస్కాంత క్షేత్రం, దట్టమైన వాతావరణం వల్ల పుడమి మీదున్న జీవానికి, సాంకేతిక పరిజ్ఞానానికి సహజసిద్ధ రక్షణ లభిస్తోంది. విమానాలు ప్రయాణించే ఎత్తయిన ప్రదేశాల్లో ఈ రక్షణ ఒకింత తగ్గుతుంది. సౌర తుపాను బలంగా ఉన్నప్పుడు నేల నుంచి 8.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవేశిత రేణువుల తాకిడి పెరిగి, లోహవిహంగాల ఎలక్ట్రానిక్స్‌పై ప్రభావం పడొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా దూసుకొచ్చే సౌర రేణువులు విమాన ఎలక్ట్రానిక్ వ్యవస్థల్లోకి చొచ్చుకెళ్లే ప్రమాదం ఉంది. ఫలితంగా వాటి మెమరీ వ్యవస్థలోని బిట్‌లలో వైరుధ్యాలు తలెత్తుతాయి. దీన్ని 'బిట్ ఫ్లిప్' అంటారు. దీనివల్ల డేటా కరప్ట్ కావొచ్చు. ఫలితంగా ఎయిర్‌క్రాఫ్ట్‌లోని నేవిగేషన్, కమ్యూనికేషన్, ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థల్లో అవరోధాలు కలగొచ్చు. ఈ నేపథ్యంలో విమానాల డిజైన్‌లో సౌర రేడియోధార్మికతను చాలా ముఖ్యమైన అంశంగా పరిగణిస్తారు.

**మేల్కొల్పు**

విమానాల్లో కీలక వ్యవస్థలకు రిడండెన్సీ ఏర్పాటు ఉంటుంది. ఫలితంగా.. ఒకటి విఫలమైతే మరొకటి అందుబాటులో ఉంటుంది. అయితే చిన్నపాటి సాఫ్ట్‌వేర్ మార్పులు కూడా విమానాన్ని దుర్బలంగా మార్చే వీలుందని జెట్‌బ్లూ ఘటన చెబుతోంది. సౌర జ్వాలలు, తుపాన్ల సమయంలో ఇది మరింత ప్రమాదకరంగా ఉంటుందని తేల్చింది. ప్రస్తుతం సౌర కాలచక్రంలో గరిష్ఠ స్థాయి నడుస్తోంది. ఈ సమయంలో సౌర తుపాన్ల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఏవియానిక్స్ వ్యవస్థల్లో అవరోధాలు, ఉపగ్రహ సేవల్లో ఆటంకాలు, జీపీఎస్ వ్యవస్థ కచ్చితత్వంలో తేడాలు, కొన్ని ప్రయాణ మార్గాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థల్లో అవరోధాలు ఉత్పన్నం కావొచ్చు. ఈ నేపథ్యంలో ఎయిర్‌క్రాఫ్ట్ సాఫ్ట్‌వేర్‌లో రేడియోధార్మికతను తట్టుకునే వెసులుబాటు ఉండాలి. యాంత్రిక సంబంధ ముప్పులతోపాటు అంతరిక్ష ముప్పులనూ తట్టుకునేలా రిడండెన్సీని ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## అవినీతి ఆరోపణలు.. క్షమాభిక్ష కోరిన నెతన్యాహు



అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ అధ్యక్షుడు ఐజక్ హట్జాగ్‌కు అధికారికంగా విజ్ఞప్తి చేశారు. ప్రధాని కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. క్షమాభిక్ష కోసం ఆయన అధ్యక్ష కార్యాలయం న్యాయ విభాగానికి తన అభ్యర్థనను సమర్పించినట్లు తెలిపింది. మరోవైపు.. అధ్యక్ష కార్యాలయం దీనిని అసాధారణ అభ్యర్థనగా పేర్కొంది. ఇది అనేక చిక్కులతో ముడిపడి ఉందని తెలిపింది.

నెతన్యాహు మూడు వేర్వేరు కేసుల్లో మోసం, నమ్మకద్రోహం, లంచాలు స్వీకరించడం వంటి అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్ చరిత్రలో విచారణకు హాజరైన ఏకైక ప్రధాన మంత్రిగా నిలిచారు. సంపన్న రాజకీయ మద్దతుదారులకు ఆయన అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే.. ఇంకా ఏ కేసులోనూ దోషిగా తేలలేదు. ఆయన కూడా మొదటినుంచి ఆరోపణలను ఖండిస్తూ వస్తున్నారు. నెతన్యాహును క్షమించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌ను కోరిన వారాల వ్యవధిలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

‘‘నాపై విచారణ విషయంలో దేశం ముక్కలుగా విడిపోయింది. క్షమాభిక్ష ప్రసాదిస్తే.. దేశ ఐక్యత పునరుద్ధరణకు తోడ్పడుతాను. అదేవిధంగా వారానికి మూడుసార్లు కోర్టుకు హాజరు కావాలనే నిబంధన అనేది.. దేశ వ్యవహారాల నిర్వహణలో ఆటంకం కలిగిస్తుంది’’ అని నెతన్యాహు పేర్కొన్నారు. ఆయన అభ్యర్థనను తొలుత న్యాయశాఖకు అభిప్రాయం కోసం పంపుతారు. అక్కడి నుంచి అధ్యక్ష కార్యాలయంలోని న్యాయ సలహాదారుకు బదిలీ అవుతుంది. అనంతరం అధ్యక్షుడి వద్దకు చేరుతుంది.

## ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకొన్న భారతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలు: డీజీసీఏ



భారత్ ఎయిర్‌లైన్స్ వాడే ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్యను పరిష్కరించినట్లు డీజీసీఏ ఆదివారం వెల్లడించింది. మొత్తం 323 విమానాల్లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసినట్లు పేర్కొంది. భారత్ ఎయిర్ బస్‌కు చెందిన ఏ320 రకం 338 విమానాలను వినియోగిస్తోంది. ఇవి ప్రధానంగా ఇండిగో, ఎయిర్ ఇండియా, ఇండియా ఎక్స్‌ప్రెస్ వద్ద ఉన్నాయి. వీటిల్లో 323 మాత్రమే ప్రస్తుతం విధుల్లో ఉండగా.. ఆరు మెయింటెనెన్స్‌లో ఉన్నాయి. మరో తొమ్మిది విమానాలకు ఎటువంటి అప్‌గ్రేడ్ అవసరంలేదని డీజీసీఏ అధికారులు తెలిపారు.

సూర్యుడి వేడి కారణంగా ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ వ్యవస్థను దెబ్బతింటున్నాయి. తత్ఫలితంగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల ఎయిర్‌బస్‌కు చెందిన జెట్ బ్లూ ఏ320 అనే విమానానికి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. దీంతో ఈ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసుకోవాలని ఎయిర్‌బస్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సాఫ్ట్‌వేర్ దెబ్బతినడానికి తీవ్రమైన సోలార్ రేడియేషన్ కారణమని అధికారులు తాజాగా తేల్చారు. ఏ320 మోడల్ విమానాల్లో నియంత్రణకు సంబంధించిన కీలక డేటా దెబ్బతిందని, అందువల్ల సాఫ్ట్‌వేర్‌లో మార్పులు సూచిస్తున్నామని ఎయిర్‌బస్ పేర్కొంది. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 6 వేల ఎయిర్‌బస్ విమానాలకు సాఫ్ట్‌వర్ అప్‌గ్రేడేషన్ అవసరమని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏ320 విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ క్రమంలో భారత్‌లోని అన్ని విమాన సంస్థలు ఆ మేరకు చర్యలు చేపట్టాలని పౌర విమానాల నియంత్రణ సంస్థ(డీజీసీఏ) ఆదేశాలు జారీ చేసింది. ఎయిర్‌బస్ ప్రకటన నేపథ్యంలో తమ విమాన సర్వీసులకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎయిర్‌ఇండియా, ఇండిగో, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ తెలిపాయి.

## కొండగట్టు అగ్నిప్రమాద ఘటనపై కేటీఆర్ తీవ్ర ఆవేదన



జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అభయాంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో అర్ధరాత్రి జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఫోన్ చేసి మాట్లాడిన కేటీఆర్, క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కోసం అప్పులు చేసి, ఎంతో కష్టపడి దుకాణాలు పెట్టుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ ప్రమాదంతో ఒక్కసారిగా రోడ్డున పడ్డాయని కేటీఆర్ ఆవేదన చెందారు. షాపుల్లో ఉన్న సరుకు, బొమ్మలు, ఇతర సామాగ్రి సర్వం అగ్నికి ఆహుతి అయ్యాయని, దాదాపు 30 కుటుంబాల భవిష్యత్తు నాశనమైందని విచారం వ్యక్తం చేశారు. సుమారు కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సకాలంలో ఫైర్ ఇంజన్లు రాకపోవడమే ఆస్తి నష్టం ఇంత భారీగా పెరగడానికి ప్రధాన కారణమని కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాల ఫైరింజన్ రిపేర్‌లో ఉండటం, వచ్చిన ఒక ఇంజన్ పని చేయకపోవడం, గంట తర్వాత కోరుట్ల, కరీంనగర్ నుంచి వాహనాలు రావడం ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యానికి, నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సర్వం కోల్పోయిన ఈ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జరిగిన ఆస్తి నష్టం, పూర్తిగా దెబ్బతిన్న వ్యాపారాన్ని, దుకాణాలు ఏమాత్రం పనికిరాని స్థితికి చేరడాన్ని దృష్టిలో ఉంచుకొని, మానవతా దృక్పథంతో ఒక్కో కుటుంబానికి రూ. 30 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదం విషయం తెలియగానే అక్కడికి చేరుకుని, సహాయక చర్యల్లో పాల్గొని, బాధితులకు తక్షణ సాయంగా రూ. 5000 అందజేసిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ను కేటీఆర్ అభినందించారు. స్థానికులకు, నష్టపోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోకుంటే, పార్టీ తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# సమస్య పరిష్కారానికి 60 నిమిషాల ఫార్ములా!



ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఏం చేయాలో అర్థంకాక చాలామంది సతమతమవుతుంటారు. అసలు సమస్య మూలాల్లోకి వెళ్లకుండా అనవసరంగా కంగారుపడే వారు కొందరైతే.. దాని చుట్టే తెగ ఆలోచిస్తూ చర్చోపచర్చలతో ఆరోగ్యాన్ని పాడు చేసుకొనేవారు ఇంకొందరు. దీంతో అటు సమయం వృథా.. ఇటు లేనిపోని మానసిక ఒత్తిడి. అందువల్ల ఏదైనా ఒక సమస్య ఎదురైనప్పుడు ముందుగా ఆ సమస్యేంటీ? ఎంతవరకు మీ కంట్రోల్‌లో ఉంది? నిజంగా పరిష్కరించగలిగేదేనా? అనేది ఆలోచించడం ద్వారా కేవలం 60 నిమిషాల్లోనే పరిష్కరించొచ్చంటున్నారు నిపుణులు.

ఈ సాఫ్ట్‌స్కిల్స్ మీలో ఉన్నాయా? వర్క్‌ప్లేస్‌లో వీరికే అధిక డిమాండ్!

010 నిమిషాలు: ముందుగా అసలు సమస్యేంటో నిర్ధారించుకోండి. చాలాసార్లు మనం సమస్యగా భావించేది.. అదసలు సమస్యే కాకపోవచ్చు. అందువల్ల మిమ్మల్ని మీరు ఇలా ప్రశ్నించుకోండి. సమస్యేంటీ? చేయకపోతే తలెత్తే పరిణామాలు ఏంటో ప్రశ్నించుకుంటే మీకే అర్థమవుతుంది.

1020 నిమిషాలు: సమస్యను భాగాలుగా విభజించి చూడండి. ఇందులో మీ నియంత్రణలో ఏముంది? మీకున్న పరిమితులేంటి? ఎక్కడెక్కడ చిక్కులు ఉన్నాయో తెలుసుకోండి.

2035 నిమిషాలు: ఆ తర్వాత సమస్య పరిష్కారం కోసం మేధోమథనం చేయండి. సమస్య పరిష్కారానికి సాధ్యమయ్యే రీతిలో మీకు వచ్చే ప్రతి ఆలోచననూ రాసి పెట్టుకోండి. వెంటనే మీ ఆలోచనల్ని ఫిల్టర్ చేయొద్దు. ఆ తర్వాత వాటిని క్రమపద్ధతిలో చూడండి.

3550 నిమిషాలు: ఆ తర్వాత మీరు క్రమపద్ధతిలో ఉంచిన ఆలోచనలకు కొన్ని ప్రశ్నలు సంధించి ఫిల్టర్ చేయండి. అసలు దీన్ని నేను చేయొచ్చా? లేదా? ఎంత త్వరగా దీనిపై చర్యలు తీసుకోగలను? ఇది ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం అవుతుందా? అనేది ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోండి.

5060 నిమిషాలు: ఇక యాక్షన్ మొదలు పెట్టేయండి. మీ సమస్య పరిష్కారానికి తొలి అడుగు ఆ రోజే వేయండి. ఇంకా వేచి చూడకుండా.. ఎక్కువగా ఆలోచించి ఆరోగ్యం పాడుచేసుకోకుండా పరిష్కారం దిశగా ముందుకెళ్లండి.

# ఎచ్చెర్ల సమీపంలో సముద్రతీరానికి బంగ్లాదేశ్ మత్స్యకారులు

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం మూసవానిపేట వద్ద సముద్రతీరానికి బంగ్లాదేశ్‌కు చెందిన బోటు కొట్టుకొచ్చింది. అందులో 13 మంది మత్స్యకారులు ఉన్నారు. స్థానికులు, మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లి తప్పిపోయారు. వెంట తెచ్చుకున్న ఇంధనం, భోజన సామగ్రి అయిపోవడంతో చేసేది లేక సముద్రంలో అలా కొన్ని రోజులు ఉండిపోయారు. పశ్చిమబెంగాల్, ఒడిశా మీదుగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ మూసవానిపేట వద్ద తీరంలో లంగరు వేసుకొని ఉండిపోయారు.

గమనించిన స్థానిక మత్స్యకారులు.. సంబంధిత బోటు ఈ ప్రాంతానికి చెందినది కాదని, అందులో ఉన్నవారు అనుమానితులుగా ఉన్నట్లు గుర్తించి స్థానిక, మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, స్థానిక ఎస్సై జి.లక్ష్మణరావులు సిబ్బందితో సముద్రతీరానికి చేరుకొని మూడు బోట్ల సాయంతో సముద్రంలోకి సిబ్బందిని పంపించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఒడ్డుకు వచ్చిన మత్స్యకారుల భాష, వేషధారణ ఆధారంగా బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు.

స్థానికులు, పోలీసులు వారితో మాట్లాడేందుకు ప్రయత్నించినా.. నీరసం, భయంతో వివరాలు చెప్పేందుకు ఇబ్బందిపడ్డారు. బంగ్లాదేశ్ భాష కొంచెం తెలిసిన స్థానిక మత్స్యకారులు వారితో మాట్లాడే ప్రయత్నం చేసి కొంత సమాచారం రాబట్టారు. వారం, పదిరోజుల నుంచి భోజనం లేదని, సముద్రంలో ఎటువెళ్తున్నామో తెలియని పరిస్థితిలో ఉండిపోయామని బంగ్లాదేశ్ మత్స్యకారులు వాపోయారు. 15 రోజుల పైగా సముద్రంలో ఉండిపోయి, పరిస్థితి అల్లకల్లోలంగా ఉండటంతో భయంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

ఒడ్డుకు చేరిన వెంటనే స్థానికులు మంటలు వేసి చలికాయించి, భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వారిని కళింగపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా సరిహద్దు దాటి మనం దేశంలోకి వచ్చిన బంగ్లాదేశ్ మత్స్యకారులపై చట్టప్రకారం కేసు నమోదుచేస్తామని మెరైన్ సీఐ తెలియజేశారు. 2008లో కూడా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్రతీరానికి బంగ్లాదేశ్ మత్స్యకారులు తప్పిపోయి కొట్టుకొచ్చారు.




# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం: 11 మంది మృతి

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదంజరిగింది. రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 9 మంది మహిళలతో సహా 11 మంది మృతి చెందిన ఘటన త మి ళ నా డు లో ని శివగంగ జిల్లాలో చో టు చే సు కుం ది. శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపంలోని కారైక్కుడి నుంచి దిండుక్కల్ వెళ్తున్న బస్సు, తిరుప్పూర్ నుంచి కారైక్కుడి వెళ్తున్న బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో డ్రైవర్ తో సహా ఎనిమిది మంది ఘటనాస్థలిలో మరణించగా తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు తిరుపత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 11కి చేరింది. మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రులంతా తిరుపత్తూరు, మదురై, కాయకుడి ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు.



# చిన్నారి పుట్టిన రోజు వేడుకల్లో కాల్పులు.. కాలిఫోర్నియాలో నలుగురి మృతి



అమెరికా లోని మళ్లీ కాల్పులు కలకలం సృష్టించాయి. కాలిఫోర్నియాలోని స్టాక్‌టన్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కాల్పులకు పాల్పడినట్లు శాన్ జోక్విన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం వెల్లడించింది. ఈ ఘటనలో పదుల సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు పేర్కొంది. క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. స్టాక్‌టన్‌లోని హోటల్లో ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకలు జరుగుతుండగా.. పార్టీ హాల్‌లోకి చొరబడిన దుండగులు అక్కడి వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే దుండగులు కాల్పులకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. మృతుల వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# టీ ఎక్కువగా తాగుతున్నారా..?



ప్రస్తుత రోజుల్లో చాలా మందికి రోజు మొదలుపెట్టాలంటే ఒక కప్పు టీ కావాల్సిందే. ఉదయం లేవగానే లేదా సాయంత్రం విశ్రాంతి తీసుకునేటప్పుడు టీ తాగే అలవాటు చాలా మందిలో ఉంది. వాతావరణం ఎండగా ఉన్నా, వర్షం పడుతున్నా ఈ అలవాటు మాత్రం మారదు. కొంతమంది అయితే రోజుకు నాలుగు నుంచి ఆరు సార్లు కూడా టీ తాగుతుంటారు. చాలా సార్లు టీ తాగకపోతే పని చేయలేమన్న భావన వారిలో పెరుగుతుంది. ఈ అలవాటు ఆరోగ్యానికి ఎంత వరకు మంచిదో మనం ఆలోచించాలి. విద్యార్థులు, ఉద్యోగులు, ఇంటి పనులు చేసే వాళ్ళు.. టీ తాగితే ఉత్సాహం వస్తుందని అనుకుంటారు. దాంతో కొన్ని సమయాల్లో టీ తాగడం తప్పనిసరి అవుతుంది. కానీ దీని వల్ల కలిగే చెడు ఫలితాలు మాత్రం అంత మంచివిగా ఉండవు. పరిశోధనలు చెప్పినదాని ప్రకారం.. ఎక్కువ టీ తాగడం వల్ల మన మనసుపై ప్రభావం పడుతుంది. ప్రశాంతత కోల్పోవడం, ఆందోళనతో ఉండటం, నిద్ర పట్టకపోవడం లాంటి సమస్యలు ఈ అలవాటు ద్వారానే వస్తాయి. టీలో ఉండే కెఫిన్ మన నాడీ వ్యవస్థను ఎక్కువ ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అంతేకాదు.. టీలో ఉండే టానిన్ అనే పదార్థం మన శరీరానికి అవసరమైన ఐరన్ సరిగా అందకుండా అడ్డుకుంటుంది. దీని వల్ల రక్తహీనత లాంటి సమస్యలు వచ్చే అవకాశం పెరుగుతుంది. ముఖ్యంగా ఆడవాళ్ళలో, పిల్లలలో ఇది మరింత ప్రమాదకరం. ఇంకా తీవ్రమైన విషయమేంటంటే.. క్యాన్సర్ చికిత్సలో ఇచ్చే కీమోథెరపీ మందులపై కూడా ఎక్కువ టీ తాగడం చెడు ప్రభావం చూపుతుంది. టీ తీసుకునేటప్పుడు కొన్ని రసాయన క్రియలు జరిగి చికిత్స తక్కువగా పనిచేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఇవన్నీ చూస్తే రోజుకు ఒకటి లేదా రెండు కప్పుల టీ తాగడం మాత్రమే మనిషి శరీరానికి సరిపోయే మోతాదని నిపుణులు చెబుతున్నారు. దాన్ని మించి తాగితే శరీరంపై ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యంగా టీ మీద ఎక్కువ ఆధారపడటం ఒక మానసిక సమస్యగా మారి దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సరైన సమయంలో, సరైన మోతాదులో మాత్రమే టీ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. టీ అనేది సహజమైనదే అయినా.. దీని వాడకంలో పరిమితి లేకపోతే అది ఒక మధురమైన విషంలా మారుతుంది. టీ తాగడం ఒక అలవాటు కావచ్చు.. కానీ అది ఒక బాధ్యతతో కూడిన అలవాటుగా ఉండాలి. ఎక్కువ టీ తాగడం వల్ల వచ్చే సమస్యలు ఆరోగ్యాన్ని పాడు చేయకుండా ఉండాలంటే.. రోజుకి 1 లేదా 2 కప్పులకే పరిమితం కావడం చాలా మంచిది.

# చాక్లెట్ తినడం వల్ల ఎన్ని లాభాలో..!



అయితే, మనం తినే సాధారణ చాక్లెట్స్ కంటే కూడా డార్క్ చాక్లెట్స్ చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ డార్క్ చాక్లెట్లలో చక్కెర తక్కువగా ఉంటుంది. డార్క్ చాక్లెట్ తినటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పలు పరిశోధనలు కూడా వెల్లడిరచాయి. ఎప్పుడూ ఏదో ఒక చిరుతిండి తినాలని ఉన్న ఒక చిన్న చాక్లెట్ నోట్లో వేసుకోండి. ఇక అలాంటి పదార్థాల పైకి మనసు మళ్లదు. తద్వారా అధిక బరువు పెరగకుండా ఉంటారు. చాక్లెట్ అంటే ఇష్టపడని వారుండరు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ చాక్లెట్ తినేందుకు ఇష్టపడతారు. ముఖ్యంగా అమ్మాయిలైతే చెవి కోసుకుంటారు. చాక్లెట్స్‌లో చాలా రకాలు ఉన్నాయి. ఎన్నో బ్రాండ్స్ చాక్లెట్‌లు మార్కెట్లో అమ్ముతుంటారు. అయితే, చాక్లెట్ తినడం వల్ల నోటికి రుచి మాత్రమే కాదు.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయంటున్నారు నిపుణులు. మానసిక ఒత్తిడిని తగ్గించే అద్భుత గుణాలు చాక్లెట్‌లో ఉన్నాయని చెబుతున్నారు. మన మెదడులో సెరటోనిన్ హార్మోన్ స్థాయులను పెంచి ఆందోళనలను తగ్గిస్తుంది. మనసుకు ప్రశాంతాన్నిస్తుంది.చాక్లెట్‌లో 'ఎల్‌ఆర్జినైన్' అనే అమైనో ఆమ్లం ఉంటుంది. చాక్లెట్‌లోని ఫ్లేవనాయిడ్స్ అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. అలాగే చర్మానికి రక్తప్రసరణను మెరుగుపరిచి చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. గర్భిణిగా ఉన్నప్పుడు రోజూ 30 గ్రాముల చాక్లెట్ తీసుకోవడం వల్ల పిండం ఆరోగ్యంగా ఎదుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే గర్భిణులు చాక్లెట్ తినాలని నిపుణులు చెబుతున్నారు. అయితే, మనం తినే సాధారణ చాక్లెట్స్ కంటే కూడా డార్క్ చాక్లెట్స్ చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ డార్క్ చాక్లెట్లలో చక్కెర తక్కువగా ఉంటుంది. డార్క్ చాక్లెట్ తినటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పలు పరిశోధనలు కూడా వెల్లడిరచాయి. ఎప్పుడూ ఏదో ఒక చిరుతిండి తినాలని ఉన్న ఒక చిన్న చాక్లెట్ నోట్లో వేసుకోండి. ఇక అలాంటి పదార్థాల పైకి మనసు మళ్లదు. తద్వారా అధిక బరువు పెరగకుండా ఉంటారు.



## ఈ ఆకులు చిన్నగా ఉన్నా.. చేసే మేలు ఎంతో తెలుసా..?

మనం తినే ఆహారంలో సరైన మార్పులు చేసుకుంటే ఆరోగ్యం బాగు చేసుకోవడం పెద్ద కష్టం కాదు. అలాంటి మార్గాల్లో మెంతి ఆకులు ఒకటి. ఇవి పూర్తిగా సహజంగా దొరుకుతాయి. మన శరీరానికి కావాల్సిన పోషకాలను ఇవి అందిస్తాయి. మన పెద్దలు.. ముఖ్యంగా పల్లెల్లో ఉండేవాళ్ళు మెంతి ఆకుల గొప్పదనాన్ని చాలా ముందుగానే గుర్తించారు. అయితే ఈ రోజుల్లో నగరాల్లో ఉంటున్న వాళ్ళు ఆరోగ్యకరమైన ఆహారం కావాలని అనుకుంటున్నా.. ఈ చిన్న ఆకుల్లో ఉన్న ఆరోగ్య రహస్యాలను మర్చిపోతున్నారు. మెంతి ఆకులను పరోటాలు, కూరలు, పచ్చడి లాంటి వాటిలో వాడడం ద్వారా మనం వాటిని సులభంగా మన ఆహారంలో చేర్చుకోవచ్చు. ఈ ఆకుల్లో జీర్ణక్రియకు సహాయపడే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఫైబర్, ప్రొటీన్లు ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా జీర్ణక్రియలు సరిగా జరిగేలా చేస్తాయి. మధుమేహం ఉన్నవారికి మెంతి ఆకులు చాలా మంచి చేస్తాయి. వీటిలో ఉండే సహజ పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి షుగర్ స్థాయిలను సమతుల్యం చేస్తాయి. ఇవి శరీరంలోని అనవసరపు కొవ్వును తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచడానికి తోడ్పడతాయి. దీని వల్ల గుండె సమస్యల నుంచి దూరంగా ఉండడానికి అవకాశం ఉంటుంది. మెంతులు ఆడవాళ్లకు ఎంతో మేలు చేస్తాయి. బిడ్డ పుట్టాక తల్లి పాలు ఎక్కువ రావడానికి ఇవి సహాయపడుతాయి. అలాగే అరుగుదల సమస్యలు, మలబద్ధకం, గ్యాస్ లాంటి సమస్యలను తగ్గించడంలో ఇది సహజమైన మందులా పనిచేస్తుంది. మగవాళ్ళ విషయంలో చూస్తే మెంతులు శరీర శక్తిని పెంచడంలో.. సహజ హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరచడంలో తోడ్పడతాయి. మనసు ఉల్లాసంగా ఉండడమే కాక.. శరీరం దృఢంగా మారడానికి కూడా ఇవి సహాయపడతాయి. మెంతులు రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకుంటే గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది. సరైన మోతాదులో రోజూ మెంతులను తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యాన్ని పూర్తిగా బాగు చేసుకోవచ్చు. మెంతి ఆకులను వాడడం ద్వారా మనం మన ఆరోగ్య ప్రయాణంలో సహజ మార్గాన్ని ఎంచుకున్నట్లే.




## ఇలాంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకండి..

సోడియం, పొటాషియం తక్కువగా, ఫైబర్ అధికంగా ఉన్న ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం. పోషకాలు నిండిన కూరగాయలు తినడం కిడ్నీలను కాపాడతాయి. కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఉప్పు, ఆల్కహాల్, ప్రాసెస్ చేసిన ఆహారాలు తినకూడదు. రోజుకు రెండు నుండి 3 లీటర్ల నీటిని తప్పనిసరిగా తాగటం అలవాటు చేసుకోవాలి. మన శరీరంలోని కీలకమైన అవయవాలలో కిడ్నీలు ఒకటి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఇది శరీరం నుండి వ్యర్థాలు, విషాలను తొలగించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అవి మన శరీరంలోని సహజ ఫిల్టర్లు. అన్ని అవయవాల మాదిరిగానే, మన మూత్రపిండాలను కూడా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అవి హైడ్రేటెడ్‌గా ఉండేలా చూసుకోవాలి. ఈ మూత్రపిండంలో ఏదైనా సమస్య ఉంటే అది శరీరంలోని ఇతర భాగాలలో సమస్యలను సూచిస్తుంది. ఇలాంటి సమస్యలు చిన్నగా ఉన్నప్పుడే గమనించి పరిష్కరించుకోవాలి. లేకుంటే అవి తరువాత పెద్ద సమస్యగా మారి మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తాయి. మూత్రపిండాల వైఫల్య సంకేతాలు ఉంటే శరీరంలోని ఈ భాగాలలో సమస్యలు కనిపిస్తాయి. మూత్రపిండాలకు సంబంధించిన సమస్య ఉంటే మొదటి లక్షణం నడుము కింది భాగంలో తీవ్రమైన నొప్పి వేధిస్తుంది. మూత్రాశయంలో వాపు పెరిగితే భవిష్యత్తులో అది తీవ్రమైన పరిణామాలకు కారణమయ్యే అవకాశం ఉంది. అలాగే, మూత్రపిండాల్లో రాళ్లు ఉంటే సాధారణంగా గజ్జ ప్రాంతంలో వాపు లేదా సున్నితత్వం అనుభూతి చెందుతుంది. పక్కటెముకల చుట్టూ నొప్పిగా ఉంటుంది. తరచూ వికారంగా ఉండడం, వాంతులు, ఆకలి లేకపోవడం వంటివి కూడా సంకేతాలు. అలాగే, పాదాలు, చీలమండ వద్ద వాపు, తక్కువగా శ్వాస తీసుకోవడం, నిద్రలేమి, ఎక్కువగా లేదా తక్కువగా మూత్రవిసర్జన వంటివి మూత్రపిండాల సమస్యలకు సంకేతం అంటున్నారు నిపుణులు. మూత్రపిండాల పనితీరులో ఏదైనా సమస్య ఉంటే, అది తీవ్రమైన కడుపు నొప్పిని కలిగిస్తుంది. కొన్నిసార్లు ఇది మూత్రపిండాల వైఫల్యానికి సంకేతం కూడా కావచ్చు. ఇటువంటి ప్రమాదకరమైన సమస్యలను నివారించడానికి కొన్ని సాధారణ ఇంటి చిట్కాలు, అలవాట్లను అనుసరించాలి. మీ మూత్రపిండాలు జాగ్రత్తగా ఉండాలంటే సరైన ఆహారం తినాలి. సోడియం, పొటాషియం తక్కువగా, ఫైబర్ అధికంగా ఉన్న ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం. పోషకాలు నిండిన కూరగాయలు తినడం కిడ్నీలను కాపాడతాయి. కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఉప్పు, ఆల్కహాల్, ప్రాసెస్ చేసిన ఆహారాలు తినకూడదు. రోజుకు రెండు నుండి 3 లీటర్ల నీటిని తప్పనిసరిగా తాగటం అలవాటు చేసుకోవాలి.

## వాకింగ్ వల్ల హై బీపీ తగ్గుతుందా..?

ప్రస్తుత రోజుల్లో హై బీపీ చాలా సాధారణ ఆరోగ్య సమస్య అయింది. దీన్ని సరిగ్గా నియంత్రించకపోతే అది గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీలు పాడవడం లాంటి ప్రమాదకర సమస్యలకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో వాకింగ్ వల్ల నిజంగా రక్తపోటు తగ్గుతుందా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. నడక అనేది చాలా సులభమైన వ్యాయామం. దీనికి ప్రత్యేక పరికరాలు అవసరం లేదు. ఎక్కడైనా నడవొచ్చు. చిన్న స్థలంలో కూడా నడక చేయవచ్చు. ఇది శరీరానికి చాలా మంచి కార్డియో వ్యాయామం. ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తులు, రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో ఇది చాలా ఉపయోగపడుతుంది. మన గుండె రక్తాన్ని శరీరంలోని అన్ని భాగాలకు పంపేటప్పుడు రక్తనాళాల్లో ఏర్పడే ఒత్తిడిని రక్తపోటు అంటారు. కానీ ఇది ఎప్పుడూ ఎక్కువగా ఉంటే రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి అవి గట్టిపడుతాయి. దీని వల్ల గుండెపోటు, కిడ్నీ దెబ్బతినడం, బ్రెయిన్ స్ట్రోక్ లాంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. రోజూ నడిస్తే గుండె వేగంగా కొట్టుకుంటుంది. దీని వల్ల గుండె బలంగా మారుతుంది. బలమైన గుండె శరీరానికి అవసరమైన రక్తాన్ని సమర్థంగా పంపగలదు. ఫలితంగా రక్తనాళాల్లో ఒత్తిడి తగ్గుతుంది. అంతేకాకుండా నడక వల్ల రక్తనాళాలు సులభంగా నర్మంగా కదులుతూ ఉండడంతో రక్తప్రసరణ మరింత మెరుగవుతుంది. శరీర బరువు ఎక్కువగా ఉన్నప్పుడు గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. అయితే రోజూ వాకింగ్ చేస్తే క్యాలరీలు ఖర్చవ్వడం ద్వారా బరువు అదుపులో ఉంటుంది. ఇది పరోక్షంగా హై బీపీని తగ్గించడంలో సహాయపడుతుంది.వాకింగ్ వల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. ఒత్తిడిని తగ్గించడం ద్వారా బీపీని కూడా తగ్గించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి వాకింగ్ వల్ల ఇన్సులిన్ ప్రభావం మెరుగవుతుంది. దీని వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు తగ్గి రక్తపోటు పెరగకుండా కాపాడుతుంది. మొదటి రోజూ 10 నుండి 15 నిమిషాలు నడవడం మొదలుపెట్టాలి. తర్వాత నెమ్మదిగా ఆ సమయాన్ని 30 నిమిషాలకు పెంచుకోవచ్చు. నడిచేటప్పుడు శరీరం నిటారుగా ఉండేలా చూసుకోవాలి. తల వంచకుండా, నేరుగా చూస్తూ, చేతులను స్వేచ్ఛగా ఊపుతూ నడవడం మంచిది. వాకింగ్ చాలా సాధారణంగా కనిపించినా దాని ప్రయోజనాలు చాలా ఎక్కువ. ముఖ్యంగా హై బీపీ ఉన్నవారికి ఇది చాలా సురక్షితమైన, సహజమైన మార్గం. రోజూ కొంతసేపు నడవడం వల్ల రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి కూడా దారితీస్తుంది.



## నల్లనువ్వులతో ఎన్ని లాభాలో..



అంతే కాకుండా నిద్ర లేమి, నొప్పులు వంటివి కూడా తగ్గించేందుకు సహాయ పడుతుంది. నల్ల నువ్వులు తరచూ చర్మంపై ఉపయోగిస్తే మచ్చలు, ముడతల తొలగిస్తుంది. నల్ల నువ్వుల్లో మెగ్నీషియం, విటమిన్ బీ6 వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మెదడు ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో సహకరిస్తాయి. నువ్వుల్లో జింక్, క్యాల్షియం అనేవి ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చడంలో సహాయపడతాయి. నువ్వులు.. సైజులో చాలా చిన్నవి..కానీ, పోషకాలలో మాత్రం అత్యంత శక్తితో నిండి ఉన్నాయి. తరచూ నల్లనువ్వులు తీసుకోవడం వల్ల నమ్మలేని ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నువ్వుల్లో పోషకాలు, ఖనిజాలు, విటమిన్లు అనేవి ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. నల్ల నువ్వుల నూనె రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. సీజనల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. నల్ల నువ్వుల నూనె రక్త ప్రసరణ, ఆక్సిజన్ కణజాలాలకు అందించడంలో సహాయపడుతుంది. నల్ల నువ్వుల నూనెలోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. నల్ల నువ్వుల నూనెలో కీళ్ల నొప్పులు తగ్గించడంలో సహాయపడే శోథ నిరోధక లక్షణాలు ఉన్నాయి. నల్ల నువ్వుల్లో ఫైబర్ అనేది అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గించడంలో బాగా పని చేస్తాయి. దీంతో కడుపులో నొప్పి, ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు ఉండవు. నువ్వుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, పాలీ అన్ శాచురేటెడ్ కొవ్వులు మెండుగా ఉంటాయి. ఇవి రక్తంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. దీని వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఎముక ఆరోగ్యానికి నల్ల నువ్వులు ఎంతో ఆవశ్యకం. ఈ నూనె చర్మాన్ని హైడ్రేట్ చేసి పోషణ అందిస్తుంది. నల్ల నువ్వుల్లో ఉండే పోషకాలు ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. నల్ల నువ్వులు తినడం వల్ల శరీరంలో సెరొటోనిన్ అనేది ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది. అంతే కాకుండా నిద్ర లేమి, నొప్పులు వంటివి కూడా తగ్గించేందుకు సహాయ పడుతుంది. నల్ల నువ్వులు తరచూ చర్మంపై ఉపయోగిస్తే మచ్చలు, ముడతల తొలగిస్తుంది. నల్ల నువ్వుల్లో మెగ్నీషియం, విటమిన్ బీ6 వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మెదడు ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో సహకరిస్తాయి. నువ్వుల్లో జింక్, క్యాల్షియం అనేవి ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా మార్చడంలో సహాయ పడతాయి.

సోమవారం-01- డిసెంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డిసెంబర్ 4 నుంచి కవిత 'జనంబాట' యాత్ర పునఃప్రారంభం



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 'జాగృతి జనంబాట యాత్ర'పై మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 4వ తేదీ నుంచి జనంబాట కొనసాగించాలని నిర్ణయించారు. అక్టోబరు 25వ తేదీన నిజామాబాద్‌లో కవిత జనంబాట యాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, హన్మకొండ, నల్గొండ, మెదక్, ఖమ్మం, రంగారెడ్డి, వనపర్తి, కామారెడ్డి జిల్లాల్లో యాత్ర పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ రావడంతో గ్రామీణ జిల్లాల్లో యాత్రను నిలిపివేశారు కవిత. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ లేని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో డిసెంబరు నాలుగో తేదీ నుంచి ఏడో తేదీ వరకు యాత్ర నిర్వహించాలని భావించారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి కార్యాలయం సవరించిన షెడ్యూల్‌ను ఆదివారం ప్రకటించింది. హైదరాబాద్ జిల్లాలో డిసెంబర్ 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు యాత్ర చేపట్టనున్నారు కవిత. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 18,19 తేదీల్లో, గద్వాల జిల్లాలో 21, 22 తేదీల్లో యాత్ర నిర్వహించనున్నారు. యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, సూర్యాపేట, సిరిసిల్ల, జనగామ, భూపాలపల్లి, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, ములుగు, జగిత్యాల, మహబూబాబాద్, నిర్మల్, నారాయణపేట, సిద్ధిపేట, మంచిర్యాల జిల్లాలో ఫిబ్రవరి మూడో వారం వరకు యాత్ర కొనసాగించనున్నారు కవిత.

# బ్రిటన్‌లో భారతీయ విద్యార్థి హత్య



బ్రిటన్‌లో భారతీయ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. హరియాణాలోని చర్కి దాద్రికి చెందిన విజయ్‌కుమార్ షియోరాన్(30) యూకేలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున వెర్సెస్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై కత్తులతో దాడి చేసి పారిపోయారు. స్థానికులు విజయ్‌ను ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఇండియాలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగం చేసిన విజయ్ ఉన్నత విద్య కోసం ఈ ఏడాది ప్రారంభంలో యూకే వెళ్లాడు. బ్రిస్టల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ది వెస్ట్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో చదువుతున్నాడు. అతని హత్యకు కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై బ్రిటిష్ పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. వీలైనంత త్వరగా తమ కుమారుడి మృతదేహాన్ని దేశానికి తీసుకురావాలని అతడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఘటనలో ఐదుగురు అనుమానితులను బ్రిటన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

## కాంగ్రెస్ హిల్ట్‌పి భూ కుంభకోణంపై

# కేటీఆర్ బహిరంగ లేఖ



(మొదటి పేజీ తరువాయి)

దీనివల్ల అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలు నామమాత్రపు ధరకే పూర్తిగా సొంతం చేసుకోవడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఫలితంగా తెలంగాణ ప్రజలకు రూ. 5 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని చెప్పారు. హైదరాబాద్‌లోని కీలక క్లస్టర్‌లలో మునుపటి ప్రభుత్వాలు 9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పనకు కేటాయించాయని వివరించారు. అయితే, ప్రజలకు దక్కాల్సిన ఆస్తులను హిల్ట్‌పి కింద తక్కువ ఖర్చుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, లక్షల కోట్ల విలువైన భూమిని ప్రభుత్వం నామమాత్రపు ధరకు క్రమబద్ధీస్తుందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటుతనం ఈ పాలసీలో దాగున్న రాజకీయ అవినీతిపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెలుపలికి కాలుష్య పరిశ్రమలను తరలించాలని పైకి చెబుతున్నా.. లక్షల కోట్ల తెలంగాణ సంపదను దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్లాన్ వేసిందని కేటీఆర్ ఆరోపించారు. అయితే, తరలించాలనుకునే పరిశ్రమలకు ప్రత్యామ్నాయ స్థలాలను ఈ విధానం గుర్తించలేదని చెప్పారు. ఈ భూముల బదిలీ వల్ల కలిగే పర్యావరణ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం వంటి లోపాలు పాలసీలో ఉన్నాయని వివరించారు.

దీనివల్ల నగరంలో కొత్త పారిశ్రామికాభివృద్ధికి బదులుగా, పాత పారిశ్రామిక యూనిట్ల స్థానంలో ఆకాశహర్మ్యాలు, వాణిజ్య సముదాయాలు పెరిగే అవకాశం ఉందన్నారు. 'ఈ విధానాన్ని కొద్దిమంది కాంగ్రెస్ నాయకులు, పలుకుబడి ఉన్న రియల్ ఎస్టేట్ గ్రూపులు, ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తలకు, కుటుంబంలోని వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా రూపొందించారు. తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడానికే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దలు తమ కోసం ఈ పాలసీని తెచ్చారు'అని కేటీఆర్ ఆరోపించారు.

'పెద్దఎత్తున జరుగుతున్న అక్రమాల గురించి ఇప్పటివరకు తెలియకుంటే కనీసం ఇప్పుడైనా తెలంగాణలో జరుగుతున్న రూ.5 లక్షల కోట్ల కుంభకోణాన్ని అడ్డుకోండి. మౌనంగా ఉంటే మీకు (రాహుల్ గాంధీని ఉద్దేశించి), కాంగ్రెస్ పార్టీకి భాగస్వామ్యం ఉందని, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అనుమతితోనే ఈ భూ కుంభకోణం జరుగుతున్నదని భావించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ భారీ అవినీతికి అడ్డుకట్ట వేయాలి'అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రైతుభరోసా పై కాంగ్రెస్ కుట్ర చేస్తున్నది: హరీశ్‌రావు



రాష్ట్రంలో 70 లక్షల ఎకరాలకు రైతుభరోసా డబ్బులు ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. పంటలు సాగుచేసిన భూములకే రైతుభరోసా డబ్బులు వేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పడం.. ఈ విషయాన్ని బలపరుస్తోందని ఆయన అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ 11 పర్యాయాలు రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో వేయగా, కరోనా సమయంలో కూడా ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆపలేదన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలప్పుడే రైతు భరోసా నిధులిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి మూడు పంటలకు రైతుబంధు వేయాలని డిమాండ్ చేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. గతేడాది కొన్న సన్నవడ్లకు సంబంధించిన బోనస్ రూ.1,150 కోట్లు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. మక్కలు, సోయా కొని నెలగడుస్తున్నా చెల్లింపులు చేయలేదన్నారు. రైతులు పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ఓడిస్తేనే రైతుభరోసా, బోనస్, పంటల బీమా వస్తాయన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.



# రాంచీలో టీమిండియా థ్రిల్లింగ్ విన్

## కుల్దీప్, హర్షిత్ ఘాటు బౌలింగ్



రాంచీ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా విజయం సాధించింది. 350 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా అద్భుతమైన పోరాటం చేసి 332 పరుగులకు ఆలౌటైంది. కుల్దీప్ నాలుగు, హర్షిత్ రాణా మూడు వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికాను దెబ్బ తీశారు. మిడిలార్డర్ బ్యాటర్ మాథ్యూ (72), మార్కో యన్‌సెన్ (70), బాష్ (67) పోరాడినా దక్షిణాఫ్రికాను గెలిపించలేకపోయారు.

టీమిండియా నిర్దేశించిన 350 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు శుభారంభం లభించలేదు. 11 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఐదెన్ మార్‌క్రమ్‌ను అర్ష్‌దీప్ సింగ్ అవుట్ చేశాడు. ఆ తర్వాత ర్యాన్ రికెల్టన్, క్వింటెన్ డికాక్ పరుగులేమీ చేయకుండానే హర్షిత్ రాణా బౌలింగ్‌లో అవుటయ్యారుడు. ఆ దశలో మాథ్యూ, టోనీ జోర్జీ (39) నాలుగో వికెట్‌కు 66 పరుగులు జోడించి దక్షిణాఫ్రికాను ఆదుకున్నారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని కుల్దీప్ యాదవ్ విడదీశాడు. టోనీని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన బ్రావిస్ (37) కూడా మాథ్యూకు అండగా నిలిచాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 53 పరుగులు జోడించాడు.

బ్రావిస్‌ను హర్షిత్ అవుట్ చేసి ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన యన్‌సెన్ అద్భుతంగా ఆడి దక్షిణాఫ్రికాను విజయానికి చేరువ చేశాడు. 39 బంతుల్లోనే 3 సిక్స్‌లు, 8 ఫోర్లతో 70 పరుగులు చేశాడు. మాథ్యూతో కలిసి 97 పరుగులు జోడించాడు. అయితే వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో అవుటవడం సఫారీ జట్టును దెబ్బ తీసింది. చివర్లో బాష్ (67) వీరోచిత పోరాటం చేసి భారత్‌ను భయపెట్టాడు. చివరకు దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌటైంది. కేవలం 17 పరుగుల తేడాతో ఓడిపోయింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 4 వికెట్లు తీశాడు. హర్షిత్ రాణా 3, అర్ష్‌దీప్ రెండు వికెట్లు పడగొట్టారు. ప్రసిద్ధ్ కృష్ణ ఒక వికెట్ తీశాడు.





# ప్రధాని మోదీ రాయ్‌పూర్‌లో పోలీసుల 60వ అఖిల భారత సదస్సులో ప్రసంగం



పోలీసులంటే ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఉన్న భావనను ఎంతగానో మెరుగుపరచాల్సిన అవసరముందని ప్రధాని మోదీ అన్నారు. ''అది జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసులదే. అందుకోసం వారే సున్నితత్వం, జవాబుదారీతనం పెంచుకోవాలి''అని ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఆ శాఖలో ప్రొఫెషనలిజం మరింత మెరుగవాలని ఆకాంక్షించారు.

రాయ్‌పూర్‌లో మూడు రోజుల పాటు జరిగిన డీజీపీలు, ఐజీల 60వ అఖిల భారత సదస్సును ఉద్దేశించి ఆదివారం ఆయన ప్రసంగించారు. విచ్ఛిన్న కార్యకలాపాలకు పాల్పడేందుకు పొంచి ఉన్న నిషేధిత శక్తులపై నిత్యం డేగ కన్నుంచడం కూడా అత్యవసరమని ఉద్బోధించారు. వామపక్ష తీవ్రవాదం నుంచి విముక్తమైన ప్రాంతాల సమగ్రాభివృద్ధిలో పోలీసులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అప్పుడే ప్రజల్లో వారి పట్ల మరింత సదభిప్రాయం కలుగుతుందని గుర్తు చేశారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో సువిశాలమైన భారత తీర రక్షణను మరింత బలోపేతం చేసేందుకు వినూత్న చర్యలు చేపట్టాల్సిన అవసరం కూడా ఎంతో ఉందని చెప్పారు.

'వికసిత భారతం: భద్రతా కోణాలు' ప్రధానాంశంగా ఈ సదస్సు జరిగింది. డ్రగ్స్ భూతం కట్టడి మొదలుకుని తీర రక్షణ దాకా విభిన్నాంశాలపై మూడు రోజుల పాటు లోతైన చర్చ జరిగింది. విజన్ 2047 సాకారానికి పోలీసులపరంగా తీసుకోవాల్సిన పలు చర్యలు ప్రస్తావనకు వచ్చాయి. హిడ్మా తదితర మావోయిస్టు అగ్రనేతలను పోలీసులు ఇటీవలే ఎన్‌కౌంటర్ చేసిన నేపథ్యంలో ఛత్తీసగఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో సదస్సు జరగడం గమనార్హం. అర్బన్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం, పర్యాటక పోలీసింగ్‌ను మరింత స్నేహశీలంగా మార్చడం, కొత్తగా వచ్చిన భారత న్యాయ చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషిచేయడం తదితరాలపై పోలీసులు బాగా దృష్టి సారించాలని మోదీ హితవు పలికారు. ప్రాకృతిక విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకునే విషయంలోనూ పోలీసులు ముందు వరుసలో నిలవాలన్నారు. పోలీసు విచారణల్లో ఫోరెన్సిక్ వాడకంపై కేస్ స్టడీలు రూపొందించాల్సిందిగా యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలకు పలుపునిచ్చారు. ఇంటలిజెన్స్ బ్యూరోకు చెందిన అధికారులకు రాష్ట్రపతి పోలీసు మెడల్స్‌ను మోదీ ఈ సందర్భంగా ప్రదానం చేశారు. అర్బన్ పోలీసింగ్‌లో అత్యుత్తమంగా నిలిచిన నగరాలకు తొలిసారిగా ప్రవేశపెట్టిన అవార్డులను అందజేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల డీజీపీలు, ఐజీలు, కేంద్ర పోలీసు బలగాల సారథులు తదితరులు సదస్సులో పాల్గొన్నారు. మరో 700 మందికి పైగా పోలీసు ఉన్నతాధికారులు వర్చువల్‌గా ఈ కీలక సదస్సులో భాగం పంచుకోవడం విశేషం.

# పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల సహకారం కోరిన ప్రభుత్వం



పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా జరిగేలా ప్రతిపక్షాలు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. 36 రాజకీయ పార్టీలకు చెందిన 50 మంది సభ్యులు హాజరయ్యారు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్‌తోపాటు కాంగ్రెస్ తరఫున జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, వైఎస్సార్‌సీపీ తరఫున పి.మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్ర బోస్, ఆర్జేడీ తరఫున మనోజ్ ఝా, డీఎంకే నుంచి టీఆర్ బాలు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి డెరెక్ ఓబ్రియన్, కల్యాణ్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ తరఫున రాంగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

ఎస్ఐఆర్, జాతీయ భద్రత, వాయు కాలుష్యం, ఢిల్లీ బాంబు పేలుళ్లు వంటి అంశాలపై పార్లమెంట్‌లో చర్చించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. రాష్ట్ర విభజన వ్యవహారాలు, విశాఖ స్టీల్ ప్లాంట్, ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం వంటి అంశాలపై చర్చ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తి చేసింది. ఎస్ఐఆర్ అంశానికి అన్నింటికంటే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రత్యేకంగా చర్చించాలని తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పట్టుబట్టాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎలాంటి అలజడి లేకుండా నిర్మాణాత్మక చర్చలు జరగాలని కోరుకుంటున్నామని, ఇందుకోసం అన్ని పార్టీలతో సంప్రదింపులు జరుపుతామని ప్రభుత్వం వెల్లడించింది.